విశాలాంధ్ర

ప్రకాశం
బాపట్ల

ఆదివారం 09 నవంబరు 2025   8 పేజీలు

సీపీఐ బలోపేతానికి కృషి

- ❑ రాష్ట్ర మహాసభలు విజయవంతం చేసినందుకు కృతజ్ఞతలు
- ❑ పార్టీ బలపడేందుకు అందరి సహకారంతో ముందుకు వెళ్తా
- ❑ ప్రపంచవ్యాప్తంగా వామపక్ష భావాలకు ఆదరణ పెరుగుతుంది
- ❑ వామపక్షాల ఐక్యత కోసం సీపీఐ ముందుంటుంది
- ❑ సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య

విశాలాంధ్ర -ఒంగోలు : సీపీఐ రాష్ట్ర 28వ మహాసభల విజయవంతానికి సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య పేర్కొన్నారు. సిపిఐ 28వ రాష్ట్ర మహాసభల ఆహ్వాన సంఘం ముగింపు సభ కార్యక్రమాన్ని ఒంగోలులోని మల్లయ్య లింగం భవనంలో శనివారం నిర్వ హించారు. ఈ సభకు సీపీఐ ప్రకాశం జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఈశ్వరయ్య మాట్లాడుతూ ఒంగోలులో సిపిఐ రాష్ట్ర 28వ రాష్ట్ర మహాసభలు కనివిని ఎరుగని రీతిలో విజయవంతం అయ్యాయి అన్నారు. అందుకు సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర మహాసభ సందర్భంగా ఏపీ ప్రజానాట్యమండలి కళాకారులు సీపీఐ వంద సంవత్సరాల వేడుకలను పురస్కరించుకొని మూడు రోజులు పాటు వందమంది కళాకారులతో, 100 పాటలతో, 100 గళాలతో, 100 కళారూపాలతో సివియన్ గ్రీటింగ్ రూమ్ హాల్ లో నిర్వహించిన ప్రదర్శనలు ప్రజలను విశేషంగా ఆకట్టుకున్నాయన్నారు. ఈ కార్యక్రమాలకు సినీనటులు మాదాల రవి, ప్రముఖ వాగ్గేయకారులు గోరేటి వెంకన్న, రచయిత జయరాజ్, అన్న నల్లూరి వెంకటేశ్వర్లు వంటి వారు హాజరు కావడం విశేషం అన్నారు. అంతేకాకుండా ఏపీ ప్రజానాట్యమండలి జిల్లా వ్యాప్తంగా 16 రోజులపాటు సీపీఐ జిల్లా చరిత్ర, చేసిన పోరాటాలు, పోరాట యోధుల చరిత్రను జిల్లా వ్యాప్తంగా ప్రచారం చేయడమే కాకుండా, మహాసభల విశిష్టతను తెలియజేశారని, మహాసభలపై ఆసక్తిని పెంపొందించారు అన్నారు. అలాగే మహా ప్రదర్శనలో గత 30 సంవత్సరాల కాలంలో ఒంగోలులో కని విని ఎరుగని రీతిలో ఎర్ర చొక్కాలతో, ఎర్ర చీరలతో, ఎర్ర గొడుగులతో, దింసా నృత్యాలతో, డప్పుల చప్పుళ్ల తో, విద్యార్థులు, యువత, మహిళలు, పేదలు, వ్యవసాయ కార్మికులు, రైతులు, బడుగు బలహీన వర్గాలు, కార్మికులు, పెద్ద ఎత్తున క్రమశిక్షణతో ర్యాలీలో పాల్గొన్నారని పేర్కొన్నారు. ఒంగోలు నగరంలోని అతిపెద్ద ఫంక్షన్ హాలులో రాష్ట్ర మహాసభలు, ఎటువంటి లోపాలు జరగకుండా జిల్లాలోని సిపిఐ కార్యకర్తలు ఎక్కువగా కష్టపడి పని చేశారని అభినందనలు తెలిపారు. అంతేకాకుండా మహాసభల నిర్వహణ నిధి వసూళ్లలో కూడా జిల్లాలోని దాతలు పెద్ద ఎత్తున సహకరించారని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా వామపక్ష భావాలకు ఆదరణ పెరుగుతుందన్నారు. ప్రతి ఒక్క కార్యకర్త ప్రజలలో మమేకమై, వారి సమస్యల కోసం పోరాటం చేయాలన్నారు. వారిని పోరాటాలలో భాగస్వామ్యం మిగతా 2 లో ...

11న సీఎం చంద్రబాబు రాక



విశాలాంధ్ర బ్యూరో-ఒంగోలు : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ నెల 11న కనిగిరి నియోజకవర్గం పీసీ పల్లిమండలంలోని లింగన్నపాలెంకు రానున్నారు. ఆ ఊరిలో 25 ఎకరాల్లో ఏర్పాటు చేస్తున్న ఇండస్ట్రియల్ కారిడార్ పార్క్‌కు సీఎం చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా శంకుస్థాపన చేయనున్నట్లు సమాచారం. ఈ మేరకు సీఎంఓ కార్యాలయం నుంచి జిల్లా అధికారులకు సమాచారం వచ్చింది. దీంతో సోమవారం నిర్వహించనున్న మీకోసం కార్యక్రమం రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రాజాబాబు ఒక ప్రకటనలో తెలిపారు. వెనుకబడిన కనిగిరి నియోజకవర్గంలో ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు చేయడం వలన అనేక పరిశ్రమలు రానున్నాయి. దీంతో ఆ ప్రాంతంలో చదువుకున్న యువతీ యువకులకు ఉద్యోగ అవకాశాలు వచ్చే అవకాశం ఉంది. రెండు రోజుల వ్యవధిలో సీఎం ప్రోగ్రాం ఖరారు కావడంతో ఏర్పాట్లపై అధికారులు, ప్రజా ప్రతినిథులు దృష్టి సారించారు.

నిరుద్యోగ ఆంధ్రప్రదేశ్‌గా రాష్ట్రం

ఏఐవైఎఫ్ సమావేశంలో రాష్ట్ర అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు

మొజ్జాడ యుగంధర్,పరుచూరి రాజేంద్ర బాబు 3లో

కనకదాసు చరిత్రను స్ఫూర్తిగా తీసుకోవాలి

కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్

విశాలాంధ్ర - బాపట్ల : కనకదాసు చరిత్రను స్ఫూర్తిగా తీసుకొని బాపట్ల జిల్లాను అభివృద్ధి పథంలో నడిపేందుకు జిల్లా అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ అన్నారు.శనివారం జిల్లా కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాల్లో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన భక్త కనకదాసు జయంతి వేడుకలలో జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా భక్త కనకదాసు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా అధికారులకు,కురుప సంఘ సభ్యులకు,ప్రజలకు భక్త కనకదాసు జయంతి శుభాకాంక్షలు తెలిపారు.కర్ణాటక రాష్ట్రంలో కనకదాసు జయంతిని గొప్పగా నిర్వహించుకుంటారని ఆయన తెలిపారు.ఈ సందర్భంగా ఈ మహానుభావుని యొక్క జీవిత చరిత్రను మనందరం తెలుసుకోగలుగుతున్నామన్నారు.కనకదాసు శ్రీకృష్ణునికి గొప్ప భక్తుడని అన్నారు.కన్నడ సాహిత్యంను పురాతన,మధ్య,ఆధునిక సాహిత్యంగా 3 భాగాలుగా విడదీశారని ఆయన తెలిపారు.పురాతన కన్నడ మిగతా 2 లో ...

రేపు బాపట్ల జిల్లాలో
కేంద్ర బృందం పర్యటన 7 లో..

కనకదాసుల మంచి
వ్యక్తిత్వాన్ని అలవర్చుకోవాలి 2 లో..

మెడికల్ కళాశాలలు ప్రైవేటుపరం

నిర్ణయాన్ని విరమించుకోవాలి

కన్నె గంటి రమేష్

విశాలాంధ్ర - రేపల్లె : వైద్యాన్ని ప్రైవేటు పరం చేసే కూటమి ప్రభుత్వ నిర్ణయం విరమించుకోవాలని సీపీఐ రేపల్లె పట్టణ సీనియర్ నాయకులు కన్నెగంటి రమేష్ ఆందోళన వ్యక్తం చేశారు. వైద్యవిద్యను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని,మెడికల్ కాలేజీలా ప్రైవేటీకరణ నిరసిస్తూ అంబేద్కర్ బొమ్మవద్ద నిరసన ధర్నా నిర్వహించారు. మెడికల్ కాలేజీలో ప్రైవేటీకరణ వ్యతిరేకిస్తూ ప్రభుత్వ వైద్య కళాశాలల పరిరక్షణ కమిటీగా సీపీఐ, సీపీఎం జైభీమ్, సిపిఐ (ఎంఎల్),కాంగ్రెస్ పార్టీలు నిరసన ధర్నా చేపట్టడం జరిగింది. ఈ సీపీఐ రేపల్లె పట్టణ సీనియర్ నాయకుడు కన్నెగంటి రమేష్ ,జై భీమ్ పార్టీ ఇంచార్జ్ దోవా.రమేష్ రాంజీ,సిపిఐ (ఎంఎల్) నాయకులు ఎం.శోభారాణి,కాంగ్రెస్ పార్టీ రేపల్లె నాయకులు కొప్పనాతి.నాగబాబు, సీపీఎం కార్యదర్శి సిహెచ్ మణి లాల్ లు మాట్లాడుతూ ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరించడానికి నిరసిస్తూ అనేక చోట్ల రాజకీయాలకు అతీతంగా ప్రజలు, మధ్యతరగతి మేధావులు అనేక వేదికలుగా ప్రభుత్వం నిర్ణయాన్ని మార్చుకోవాలని నిరసన తెలుపుతున్నారు. అయినా రాష్ట్రప్రభుత్వం స్పందించకుండా మిగతా 2 లో ...

ఈశ్వరయ్యకు అభినందనల వెల్లువ

మొదటి పేజీ తరువాయి

చేయాలి అన్నారు. వారిలో విప్లవ భావాలు పెంచాలన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో స్వతంత్రంగా సీపీఐ వీలైన ఎక్కువ స్థానాలలో గెలుపోటములతో సంబంధం లేకుండా పోటీ చేయాలన్నారు. వామపక్షాల ఐక్యత కోసం సీపీఐ ముందు వరసలో నిలుస్తుంది అన్నారు. ఈ సభతో సీపీఐ 28వ రాష్ట్ర మహాసభ ఆహ్వాన సంఘం కాలం ముగుస్తుందని తెలిపారు. సీపీఐ ప్రకాశం జిల్లా ఇంచార్జ్ జంగాల అజయ్‌కుమార్ మాట్లాడుతూ డిసెంబర్ 26వ తేదీన తెలంగాణ రాష్ట్రంలోని ఖమ్మం లో నిర్వహించే సిపిఐ 100 సంవత్సరాల వేడుకలను జయప్రదం చేసేందుకు జిల్లాలోని అన్ని ప్రాంతాల నుండి ప్రజలు విరివి గా రావాలని పిలుపునిచ్చారు. జిల్లాలో పార్టీ అభివృద్ధికి ప్రతి ఒక కార్యకర్త పని చేయాలని కోరారు.

ఈశ్వరయ్య కు అభినందనల వెల్లువ :-

రాష్ట్ర కార్యదర్శిగా నూతనంగా ఎంపికైన గుజ్జుల ఈశ్వరయ్యకు అభినందనలు వెల్లువెత్తాయి. సీపీఐ ప్రకాశం జిల్లా సమితి, ఒంగోలు మండల సమితి, సంతనూతలపాడు, కొండపి, కనిగిరి, గిద్దలూరు, మార్కాపురం, ఎర్రగొండపాలెం, దర్శి నియోజకవర్గాల సమితులే కాకుండా మహిళా సమైక్య, ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్, ఎస్టీయూ , ఎంప్లాయిస్ యూనియన్, ఆటో వర్కర్స్ యూనియన్, ఏఐటీయూసీ, బీసీ సంఘాలు, విద్యార్థి సంఘాలు, పలువురు వైద్యులు, శ్రేయోభిలాషులు ఈశ్వరయ్యను ఘనంగా సత్కరించాయి. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి ఆర్ వెంకట్రావ్ తదితరులు పాల్గొన్నారు.

కనకదాసు చరిత్రను స్ఫూర్తిగా తీసుకోవాలి

సాహిత్యం చాలా కష్టతరమైనదని, అది ఎవరికీ అర్థం కాదని, దాన్ని ఎవరూ చదవలేరని, అర్థం చేసుకుని చదివిన వారు రాజుల వద్ద నుండి బహుమతులు పొందే వారని ఆయన తెలిపారు. మధ్య కన్నడలో అవసరం లేని కొన్ని పదాలను,పద్యాలను తొలగించి రచనలు చేయడం ప్రారంభించారని ఆయన తెలిపారు.ఆధునిక కన్నడ లో ఇంకా సరళతరం చేయడమైనదని ఆయన అన్నారు. కన్నడ దాసులు, సర్వజ్ఞ అనే కవులు ఉండేవారని, వారు రాజుల ఆస్థానంలో వాడే సాహిత్యాన్ని ప్రజల్లోకి తీసుకు వెళ్లే వారిని ఆయన తెలిపారు. జిల్లా రెవెన్యూ అధికారి గంగాధర్ గౌడ్ మాట్లాడుతూ కనకదాసు 1509వ సంవత్సరం నవంబర్ 6వ తేదీన కర్ణాటక రాష్ట్రంలో జన్మించారని ఆయన తెలిపారు.కనకదాసు సుమారు 100 సంవత్సరాలు జీవించారని ఆయన తెలిపారు.కనకదాసు అసలు పేరు తిమ్మప్ప అని ఆయన తెలిపారు.తిమ్మప్ప శ్రీకృష్ణునికి గొప్ప భక్తుడని,ఆ కాలంలో రాజు దగ్గర కోశాధికారిగా పనిచేసేవాడని ఆయన తెలిపారు.ఆయన డబ్బులో, భోగభాగ్యాలు అనుభవిస్తూ జీవితం గడుపుతున్నందున ఆయనను కనకదాసు అని పిలవటమైనదని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ అధికారి శివలీల,జిల్లా వైద్య శాఖ అధికారి విజయమ్మ,పంచాయతీ అధికారి ప్రభాకర్,పిడి డ్రామా విజయలక్ష్మి,కురుప సంఘ సెక్రటరీ మర్రి నాగ శేషు,కురుప సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నిర్ణయాన్ని విరమించుకోవాలి

అర్థంలేని వాదనలు,అబద్ధాలు ప్రచారం చేస్తూ ప్రైవేటీకరణ పేరుతో ముందుకు వెళుతున్నారని,రాష్ట్రంలో మెడికల్ కళాశాలలను ప్రభుత్వం ప్రైవేటు పరం చేస్తే వైద్యం వ్యాపారంగా మారి సామాన్య పేదలు వైద్యం అందక ప్రాణాలు కోల్పోవల్సిన పరిస్థితి వస్తుందని విమర్శించారు.పేదలకు ప్రభుత్వరంగంలో వైద్యం అందించాలనే లక్ష్యంతో గతప్రభుత్వం నిర్మాణాలు ప్రారంభించిన 17వైద్య కళాశాలలో పులివెందుల,మార్కాపురం,ఆదోని, మదనపల్లి, నర్సీపట్నం,అమలాపురం,పాలకొల్లు,బాపట్ల, పెనుగొండ, పార్వతీపురం 10 కాలేజీలు ప్రభుత్వం నిర్వహణలో కాకుండా పిపిపి పద్ధతి ద్వారా ప్రైవేటుసంస్థలకు అప్పగించటం కూటమి ప్రభుత్వం అసమర్ధ పాలనకు నిదర్శనం,సామాన్య ప్రజలకు వైద్యాన్ని అందుబాటులోకి ఉంచాలంటే ప్రభుత్వరంగంలో కొనసాగాలన్నారు. నిధులు లేకపోతే రాష్ట్రంలో కార్పొరేట్ వ్యాపారవేత్తలకు లక్షల రూపాయలు రాయితీలు ఎలా ఇస్తున్నారని ప్రశ్నించారు. గూగుల్ డేటా సెంటర్ కు 22 వేల కోట్ల రూపాయలు వివిధ రూపాల్లో రాయితీలు ఎలా ఇచ్చారు. వైద్యవిద్యకు వెనుకబడిన తరగతులు,నిమ్న జాతుల,ఈబీసీ ద్వారా చదువుకునే పేద వైద్య విద్యార్థులకు ఫీజులు విపరీతంగా పెరుగుతాయి.దాంతో సామాన్య విద్యార్థులకు వైద్య చదువుకు అవకాశాలు తగ్గుతాయి,మెడికల్ కళాశాలలను ప్రైవేటుపరం చేస్తే నేరుగా సామాజిక,ఆర్థిక రంగాలపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. ప్రైవేటు భాగస్వామ్యం ఉన్నప్పుడు సమాజానికి సేవచేసే విధానానికి భిన్నంగా ప్రైవేటు సంస్థలు లాభాపేక్షతో పనిచేస్తాయన్నారు,ప్రభుత్వ నిధులు, ప్రజాఆస్తిని ప్రైవేటు వ్యక్తులకి తమ లాభాలు కోసం ఇవ్వటం పొరపాటు నిర్ణయం,కావున రాష్ట్రప్రభుత్వం పునరాలోచించి ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ వైద్య కళాశాలల పరిరక్షణ కమిటీ ఇచ్చే పిలుపుల్లో భాగంగా రేపల్లె ప్రాంతంలో జరిగే కార్యక్రమాల్లో ప్రజలు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ప్రభుత్వ వైద్య కళాశాల పరిరక్షణ కమిటీగా వివిధ పార్టీల నేతలు ఏఐటీయూసీ రేపల్లె ఏరియా నాయకులు కోన శ్రీను, పుల్లారావు, వై.కిషోర్,కె.ఆశీర్వాదం, బాబురావు,తే క.శ్రీను,కె.వాసు,ఎం.ఈశ్వరరావు, డి.అగస్టిన్,కె.వెంకట్రావు పాల్గొన్నారు.

కనకదాసుల మంచి వ్యక్తిత్వాన్ని అలవర్చుకోవాలి

ఎస్పీ బి.ఉమామహేశ్వర్

విశాలాంధ్ర - బాపట్ల : ప్రతి ఒక్కరూ కనకదాసుల మంచి వ్యక్తిత్వాన్ని అలవర్చుకోవాలని జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్ అన్నారు.శనివారం భక్త కనకదాసు జయంతి సందర్భంగా జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో భక్త కనకదాసు చిత్రపటానికి పుష్ప మాల వేసి ఘన నివాళిల ర్పించారు.ఈ సందర్భంగా ఎస్పీ ఉమామహేశ్వర్ మాట్లాడుతూ కర్ణాటక రాష్ట్రం,హావేరీ జిల్లా బాడ గ్రామంలో 1509లో కనకదాసు జన్మించాడని తెలిపారు.చిన్న వయసులోనే ఎంతో విద్యాభ్యాసం చేసి,సమాజాన్ని వివిధ కోణాలలో గమనించిన ఆయన,నరసింహ స్తోత్రం,రామధాన్య చరిత్ర, మోహన తరంగిణి లాంటి కవిత్వాలను రచించాడని పేర్కొన్నారు.తత్వజ్ఞానాన్ని సామాన్యులకు అర్థమయ్యేలా సంగీతం,సాహిత్యంతో అందించేందుకు తన జీవితాన్ని అంకితం చేశాడని వివరించారు.కనకదాసు మహత్తరమైన కవి,భక్తుడు, తత్వవేత్త మాత్రమే కాకుండా,సమాజంలో సమానత్వం, సత్యం,ధర్మం కోసం నిరంతరం పోరాడిన మహనీయుడని ఎస్పీ తెలిపారు.సమాజంలో ఉన్న వివక్షతను, అసమానతలను తొలగించడానికి, సామాజిక సమానత్వాన్ని స్థాపించడానికి ఆయన అందించిన ప్రేరణ అమూల్యమైనదన్నారు.ఆయన బోధనలు ప్రజల్లో సాంస్కృతిక,ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించాల్సిన అవసరాన్ని సూచిస్తున్నాయని, ప్రతి ఒక్కరూ మంచి వ్యక్తిత్వాన్ని అలవర్చుకోవాలన్నారు.పోలీసు శాఖ కూడా కనకదాసు బోధనలను మార్గదర్శకంగా తీసుకొని,విధులకు కట్టుబడి సమాజసేవలో మరింత కృషి చేయాల్సిన బాధ్యత ఉందని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ పి.విజయ సారథి,బీసీఆర్బీ ఇన్స్పెక్టర్ ఆర్ అహ్మద్ జానీ,అడ్మిన్ ఆర్ఐ షేక్ మౌలుద్దీన్ తదితర పోలీసు అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావుకు సన్మానం

విశాలాంధ్ర-సిఎస్ పురం : కనిగిరిలో గురుబ్రహ్మం యోగ మందిరంలో వెలిగొండ జలాల సాధన సదస్సు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు శనివారం విచ్చేసిన సందర్భంగా రాష్ట్ర మానవ హక్కుల సంఘం అధ్యక్షులు జె వి వి మండల అధ్యక్షులు డాక్టర్ షేక్ గౌస్ జ్ఞాపికగా చిత్రపటం శాలువాతో ఘనంగా సత్కరించడం జరిగింది మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ వెనకబడిన పశ్చిమ ప్రాంతమైన ప్రకాశం జిల్లా రైతాంగానికి ప్రజలకు మేలు జరిగేందుకు వెలిగొండ ప్రాజెక్టు పూర్తి అవ్వాలని ప్రాజెక్టు పూర్తి అవడం వల్ల కిడ్నీ ఫ్లోరైడ్ సమస్యల నుంచి వెసులుబాటు కలిగించిన వెలిగొండ జలాల సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని అన్నారు అలాగే మండలంలో జె వి వి కార్యక్రమాల్లో చురుకైన కార్యక్రమాలు చేసి ప్రజల్లో సైన్స్ పట్ల అవగాహన కల్పించాలని సూచనలు తెలుపుతూ సామాజిక కార్యక్రమాలు చేస్తున్న డాక్టర్ షేక్ గౌస్ ని సభా పూర్వకంగా అభినందించారు ఈ కార్యక్రమంలో యూటీఏ సీఈఓ నీటిపారుదల నిపుణులు రాచర్ల శివ జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వి లక్ష్మారెడ్డి జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తవ్వ శ్రీనివాసులు జెవివి రాష్ట్ర నాయకులు మాలకొండ రెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు రెడ్డి జిల్లా గౌరవ అధ్యక్షులు డాక్టర్ చిన్నకృష్ణ డాక్టర్ శ్యాం ప్రసాద్ డాక్టర్ బ్రహ్మారెడ్డి సిఎస్పురం మండలం జె వి వి ప్రధాన కార్యదర్శి జె వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

విశాలాంధ్ర-పామూరు : ప్రపంచ డయాబెటిక్ దినోత్సవాన్ని పురస్కరించుకొని మాదరన్ ఐ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ సెంటర్, నెల్లూరు ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం ఈ నెల 9న ఆదివారం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ శిబిరం పామూరు పట్టణంలోని శ్రీ సత్యనారాయణ స్వామి కళ్యాణ మండపంలో జరగనుంది.ఈ కార్యక్రమానికి డాక్టర్ పి. ఎల్. రావు నేతృత్వం వహించనున్నారు. కంటి సమస్యలు, ముఖ్యంగా డయాబెటిస్ వల్ల కలిగే కంటి వ్యాధులపై అవగాహన కల్పించడం, ఉచిత కంటి పరీక్షలు, అవసరమైన వారికి చికిత్సా సలహాలు అందించడం వంటి సేవలు అందించబడ నున్నాయని నిర్వాహకులు వివరించారు. స్థానిక ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ కంటి ఆరోగ్యాన్ని పరిశీలించుకోవాలని వారు సూచించారు.

ప్రమాద భీమా చెక్కులు పంపిణీ

విశాలాంధ్ర - గిద్దలూరు : గిద్దలూరు పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి సభ్యత్వం తీసుకొని ప్రమాదవశాత్తు మరణించిన టీడీపీ కార్యకర్తల కుటుంబాలకు ప్రమాద భీమా చెక్కులు అందచేశారు. తెలుగుదేశం పార్టీ సభ్యత్వం తీసుకొని ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదంలో మరణించిన టీడీపీ కార్యకర్తల కుటుంబాలకు తెలుగుదేశం పార్టీ అండగా ఉంటూ భరోసానిస్తుందని ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు కార్యకర్తల సంక్షేమ నిధి నుండి ఒక్కొక్కరికి రూ. 5 లక్షల రూపాయలు అందచేస్తుందన్నారు. గిద్దలూరు మున్సిపాలిటీ పరిధిలో టీడీపీ కార్యకర్తలైన ఓబురాయి సురేష్, అనుమల శ్రీనివాసులు సగినాల విజయ్ కుమార్ లు రోడ్డు ప్రమాదంలో మరణించగా వారి కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే అశోక్ రెడ్డి ఒక్కొక్క కుటుంబానికి రూ. 5 లక్షల రూపాయల చెక్కులను అందచేశారు. ఈ కార్యక్రమంలో గిద్దలూరు పట్టణ అధ్యక్షులు సయ్యద్ శానేశావలి, మార్కెట్ యార్డ్ చైర్మన్ బైలడుగు బాలయ్య, 11వ వార్డు కౌన్సిలర్ లొక్కు రమేష్, యూనిట్ ఇన్ఛార్జ్ బోయిలపల్లి కిషోర్, ఖాతా రామచంద్రారెడ్డి, బలగాని నరసింహులు, సంధ్యాల ఈశ్వరయ్య, సర్పంచులు కర్నాటి రామసుబ్బారెడ్డి, ఆవుల రాజగోపాల్, దూదేకుల దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

పప్పు శెనగలో విత్తన శుద్ధి

విశాలాంధ్ర - తర్లుపాడు : ఈ సంవత్సరం కురిసిన అధిక వర్షాలకు భూమిలో అధిక తేమ వలన విత్తిన శెనగ విత్తనాలు బూజు పట్టి,విత్తనాలు కుళ్ళిపోయి మొలక శాతం తగ్గుతుందని, కాబట్టి రైతులు తప్పనిసరిగా విత్తనశుద్ధి పద్ధతులు పాటించాలని వ్యవసాయ అధికారి జ్యోష్న దేవి తెలిపారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విత్తనాలు విత్తుకునే ముందు ప్రతి కిలో విత్తనానికి కార్బెండజిం 2.5 గ్రా లేదా టబు కొనజోల్ 1.5గ్రా లేదా విటా వ్యాక్స్ పవర్ 1.5గ్రా, ట్రైకోడెర్మా విరిడి 10గ్రా విత్తనశుద్ధి చేయటం వల్ల విత్తనం ద్వారా,నేల ద్వారా వ్యాపించే తెగుళ్లను అరికట్టవచ్చని తెలియజేశారు.

మగరెక్కల పురుగులు నివారణపై అవగాహన

విశాలాంధ్ర-ముండ్లమూరు : పంటలలో మగరెక్కల పురుగుల వలన నష్టం వాటిల్లుతుందని వాటి నివారణకు తీసుకోవలసిన చర్యలపై ఆచార్య ఎన్జీరంగా బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు రైతులకు అవగాహన కల్పించారు. మండల కేంద్రమైన ముండ్లమూరులోని పంట పొలాల్లో శనివారం ఫెరమాన్ ఉచ్చులు ఎలా ఉపయోగించాలో రైతులకు అవగాహన కల్పించారు. ఫెరమాన్ ఉచ్చులు ఎలా వాడాలి వాటి వలన కలుగు ప్రయోజనాలను వివరించారు. ఈ ఉచ్చులద్వారా మగరెక్కల పురుగులను ఎలా నిర్వీర్యం చేస్తాయో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బాపట్ల వ్యవసాయ కళాశాల (రావేప్) విద్యార్థులు పి భరత్, పి అర్జున్, ఎస్ కె బాజీ, అప్రమేయ, అనుపమ్ రాయ్, రైతులు పాల్గొన్నారు.

నిరుద్యోగ ఆంధ్రప్రదేశ్‌గా రాష్ట్రం

ఏఐవైఎఫ్ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షప్రధాన కార్యదర్శులు మొజ్జాడ యుగంధర్,పరుచూరి రాజేంద్ర బాబు

విశాలాంధ్ర -ఒంగోలు : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య రోజురోజుకు పెరుగు తుందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నిరుద్యోగ ఆంధ్రప్రదేశ్ మారుతుందని , ఉద్యోగాలు కల్పిస్తా మంటూ నిరుద్యోగులకు కూటమి ప్రభుత్వ పెద్దల అరచేతిలో వైకుంఠం చూపుతున్నారని అఖిల భారత యువజన సమాఖ్య ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్ష ,ప్రధాన కార్యదర్శులు మొజ్జాడ యుగంధర్, పరచూరి రాజేంద్ర బాబు విమర్శించారు.

ప్రకాశం జిల్లా ఒంగోలు సీపీఐ కార్యాలయం నందు అఖిల భారత యువజన సమాఖ్య ప్రకాశం జిల్లా అధ్యక్షులు ఆర్. కరుణానిధి అధ్యక్షతన జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య రోజురోజుకీ పెరిగిపోతుందని ఎన్నికల సమయంలో సీఎం చంద్రబాబు నాయుడు నిరు ద్యోగ యువతకు వరాల జల్లు కురిపించారని ఇంతవరకు అమలు కాలేదని 20 లక్షల ఉద్యోగాల కల్పన కూటమి ప్రభుత్వ ధ్యేయమని చెప్పి నేడు అధికారంలో కి వచ్చిన తర్వాత నూతన ఉద్యోగాలు కల్పన చేయకుండా ఐదువేల రూపాయల జీతంతో ప్రభుత్వానికి సేవ చేస్తున్నటువంటి రెండు లక్షల అరవై వేల మంది వాలంటీర్లను ఉద్యోగాల నుండి తొలగించారని, ప్రభుత్వ మద్యం దుకాణాలలో పనిచేస్తున్నటువంటి నిరుద్యోగులను 16600 మందిని తొలగించారని, ప్రభుత్వ రేషన్ వాహనా లలో పని చేస్తున్న డ్రైవర్లు హెల్పర్లను 25, 500 మందిని ఉద్యోగాల నుంచి తొలగించారు. ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పోతుల ప్రభా కర్ ప్రకాశం జిల్లాలో ఏప్రిల్ నెలలో సచివాలయ ఉద్యోగుల ద్వారా నిర్వహించిన స్కిల్ సెన్సెక్స్ సర్వే ద్వారా ప్రభుత్వం చెప్పినటువంటి లెక్కల ప్రకారమే 7.43లక్షల పైచిలుకు నిరు ద్యోగులు ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నారని ఏటా 40000 మంది విద్యార్థులు చదువు పూర్తి చేసుకుని ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నారని స్థానికంగా ఉద్యోగాలు లేక ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లవలసిన పరిస్థితి ప్రకాశం జిల్లాలో ఉన్నటువంటి నిరుద్యోగుల మీద పడిందని, ఉద్యోగ ఉపాధి అవకాశాలు లేక యువత గంజాయి మత్తుపదార్థాలకు చెడు వ్యసనా లకు బానిసలుగా మారు తున్నారని దానికి పర్యవ సానంగా జిల్లాలో వరుస ఘటనలు జరగ డం నిదర్శనమని ప్రభుత్వ పెద్దలు మేలుకోవాలని హితవు పలికారు.

ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి సుబ్బు, రామాంజీ, పవన్ పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ

విశాలాంధ్ర - వెలిగండ్ల : మండలంలోని రాళ్లపల్లి గ్రామానికి చెందిన నన్నేసాన్ని రత్తమ్మ వెన్నుపూస నొప్పితో బాధపడుతూ ఆమెకు 25 వేల రూపాయలు చెక్కును, ఇమ్మడి చెరువు గ్రామానికి టీడీపీ కార్యకర్త వేష పోగు మోసే పాము కాటుకి ఐదు నెలల క్రితం గుండె పోటు మృతి చెందటంతో ఆయన భార్యకు ఐదు లక్షల చెక్కును, యేసేపోగు రిబ్కాకి ఐదు లక్షల రూపాయల చెక్కులను టీడీపీ మండల అధ్యక్షులు కేలం ఇంద్రపాల్ రెడ్డి ఆధ్వర్యంలో శనివారం చెక్కుల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షులు ముత్తిరెడ్డి వెంకటరెడ్డి, మాజీ తెలుగు యువత అధ్యక్షులు కర్నాటి భాస్కర్ రెడ్డి,నియోజకవర్గం రైతు అక్కి శ్రీనివాస్ రెడ్డి, మండల తెలుగు యువత అధ్యక్షులు బొబ్బా రమణా రెడ్డి, మాజీ సర్పంచ్ సానా జయపాల్ రెడ్డి, మోటాటి సుబ్బారెడ్డి, బత్తుల తిరుపతి రెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షులు రాజ గోపాల్,ముక్కు నారాయణ రెడ్డి.,బూత్ ఇంచార్జి కొప్పుల గురవయ్య, డీలర్ మీరావలి ముక్కు నారాయణరెడ్డి, డేవిడ్, జార్జి, సాగర్, తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

వివాహ వేడుకల్లో 'దారపనేని'

విశాలాంధ్ర-పామూరు రూరల్ : మండలంలోని తూర్పు కోడిగుడ్లపాడు గ్రామపంచాయతీ పరిధిలోని పోతవరం గ్రామానికి చెందిన అద్దంకి నాగమల్లేశ్వర రావు, వైదేహి దంపతుల కుమారుడు నాగరాజు, నెల్లూరు జిల్లా దుత్తలూరు మండలం సోమల రేగడ గ్రామానికి చెందిన మన్నేపల్లి శ్రీనివాసులు , లక్ష్మీదేవి దంపతుల కుమార్తె లావణ్యల వివాహ వేడుకలు శనివారం పోతవరం గ్రామంలో వైభవంగా నిర్వహించారు. ఈ వివాహ వేడుకల్లో కనిగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్ పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించి వివాహ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నక్కల గండి రిజర్వాయర్ మాజీ చైర్మన్ అద్దంకి మాల్యాద్రి, అద్దంకి నాగయ్య, అద్దంకి మల్లికార్జునరావు, మాల్యాద్రి, ప్రకాష్ రావు, కొండలరావు, ఇండ్ల చెరువు వెంకటేష్‌లు పాల్గొని ఆశీర్వదించారు.

విద్యుత్ సబ్‌స్టేషన్‌ను తనిఖీ

విశాలాంధ్ర-పెద్ద దోర్నాల : పెద్ద దోర్నాల విద్యుత్ సబ్‌స్టేషన్‌ను శనివారం విద్యుత్ శాఖ సీఎండి పుల్లారెడ్డి తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. అనంతరం అధికారులకు తగు సూచనలు సలహాలు అందజేశారు. విద్యుత్‌కు ఎటువంటి అంతరాయం కలగకుండా తగిన సమయంలో రైతులకు విద్యుత్ ఇవ్వాలని తెలిపారు. అనంత రికార్డులను పరిశీలించారు. అనంతరం విద్యుత్ గుత్తేదారులు మర్యాద పూర్వకంగా కలిశారు. దోర్నాల మాజీ మండల టిడిపి కన్వీనర్, అంబటి వీరారెడ్డి, విద్యుత్ కాంట్రాక్టర్ దొడ్డా శేషాద్రి. మర్యాదపూర్వకంగా కలిసి పూలమా లాలు , శాలువలు వేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో పలువురు విద్యుత్ అధికారులు పాల్గొన్నారు.

కదులుతున్న రైలు ఎక్కబోయి వ్యక్తి మృతి

విశాలాంధ్ర- కురిచేడు : తెనాలి నుండి మార్కాపురం వరకు వెళ్లే డెమో ట్రైన్ కురిచేడులో ట్రైన్ ఆగగా పరిగెత్తుకుంటూ పోయి ట్రైన్ ఎక్కబోయి ప్రమాదవశాత్తు జారిపడి మృతి చెందిన సంఘటన శనివారం ఉదయం 8 -30 గంటలకు సమయంలో చోటు చేసుకుంది. వివరాల ప్రకారం నరసరావుపేట ఎన్జీవో కాలనీకి చెందిన శివయ్య కురిచేడు గ్రామంలో శుక్రవారం రాత్రి యోగయ్య స్వామి ఉర్సు సందర్భంగా చిన్నపాటి వ్యాపారం చేసుకుని ఉదయాన్నే రైల్వే స్టేషన్‌కి వెళ్లి కొంతసేపు నిద్రించి రైలు కదులుతున్న సమయంలో మెలకువ రావటంతో త్వరగా లేచి ఎక్కబో తుండగా ప్రమాదవశాస్తూ జారీ రైలు పట్టాల మీద పడగా శివయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. నరసరావుపేట రైల్వే పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం నరసరావుపేటకు తరలించి, అనంతరం మృతదేహాన్ని వారి బంధువులకి అప్పజెప్పారు.

గిరిజనులకు నిత్యవసరాలు పంపిణీ

విశాలాంధ్ర-పెద్ద దోర్నాల : చెంచు గిరిజనుల కోసం కూటమి ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను చేపడుతుందని ఎర్రగొండపాలెం టీడీపీ ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్ బాబు తెలిపారు. శనివారం మండలంలోని కొర్రపోలు చెంచు గిరిజన గూడెంలో మొంథా తుఫాన్ బాధితులకి లైట్ ఫర్ బ్లైండ్ మరియు రూరల్ డెవలప్మెంట్ సర్వీస్ సొసైటీ స్వచ్ఛంద సేవా సంస్థ వారి ఆధ్వర్యంలో ఎరిక్షన్‌బాబు చేతుల మీదుగా చెంచు గిరిజనులకు నిత్యవసరాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెంచు గిరిజనుల అభివృద్ధి కోసం ఐటిడిఏ ఆఫీస్ ప్రవేశపెట్టింది స్వర్గీయ ఎన్ టి రామారావు అని తెలిపారు. తెలుగుదేశం పార్టీ చెంచు గిరిజనుల కోసం, అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి, వారి అభివృద్ధికి కృషి చేస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో దోర్నాల మండల తెలుగుదేశం పార్టీ కన్వీనర్ షేక్ మాబు, మాజీ మండల కన్వీనర్ ఎరువ మల్లికార్జున రెడ్డి, మాజీ బిజెపి మండల అధ్యక్షుడు సురవరం వీరా రెడ్డి, సంస్థ ప్రతినిధులు దాసరి స్వర్ణలత, సయ్యద్ నబి, వల్లపునేనికాశయ్య, కొప్పుల వెంకట సుబ్బారెడ్డి, చంటి, సోమ పల్లి శేఖర్ బాబు, డి. రామకృష్ణ,ఎలకపాటి చెంచయ్య, దొడ్డ శేషాద్రి, ఈదుర మల్లయ్య, నాగేంద్రబాబు, గుంటక సుబ్బరాయుడు, రమణారెడ్డి, రావి క్రింది నరసింహారావు, గుండారెడ్డి వెంగల్ రెడ్డి, షేక్ మంజూర్ భాష, మల్లారెడ్డి ,పెద్దోడు, టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ధోతి ఫంక్షన్ వేడుకల్లో 'కదిరి'

విశాలాంధ్ర-సిఎస్ పురం : కనిగిరి మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు, రక్షిత ఫార్మసీ అధినేత చందన ఆంజనేయ పట్టాభి రామేశ్వరావు మనవళ్లు సోహమ్ అనయ్, ఆరుష్ షివ్‌ల ధోతి ఫంక్షన్ వేడుక శనివారం హైదరాబాద్‌లో అక్షయ కన్వెన్షన్ హాలులో జరిగింది. ఈ వేడుకలో కదిరి బాబురావు కుటుంబ సభ్యులు పాల్గొని సోహమ్ అనయ్, ఆరుష్ షివ్‌లను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేసారు. ఫార్మసీ అధినేత తాతారావు దంపతులు, కదిరి ప్రకాశ్ రావు,కదిరి పార్థసారథి ,కదిరి బాలకృష్ణ దంపతులు, అవినాష్ శౌరి దంపతులు, సుంకరి సృజన, అల్లు తిరుపతమ్మ పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యల సాధనకు ఎస్టీయూ కృషి

విశాలాంధ్ర-పుల్లలచెరువు : రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం పుల్లలచెరువు మండల శాఖ ఆధ్వర్యంలో మండలంలోని వివిధ పాఠశాలల ఉపాధ్యాయులచే సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించబడింది.ఈ సందర్భంగా మండలంలోని ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలల్లో పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను బోధిస్తూ, ప్రభుత్వ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయడంలో తమ వంతు పాత్రను పోషిస్తున్నారని, అదే సమయంలో ఉపాధ్యాయుల హక్కులు మరియు సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాటం కొనసాగిస్తూనే ఉన్నారని పేర్కొన్నారు.ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలను తక్షణమే మంజూరు చేయాలని, కొత్త పిఆర్సి కమిషన్‌ను నియమించి తగినంత ఐఆర్‌ను ప్రకటించాలని డిమాండ్ చేశారు.

అధ్యక్షులు ఎం పూర్ణయ్య, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు డి. రామదాసు, రాష్ట్ర కౌన్సిలర్ ఎం లక్ష్మీనారాయణ, గౌరవ అధ్యక్షులు ఎం కోటేశ్వరరావు, జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి దేశానాయక్ పాల్గొన్నారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

విశాలాంధ్ర-దొనకొండ: స్థానిక ఉషోదయ కంటి వైద్యశాల 2వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిపుణులు దుగ్గెంపూడి శ్రీనివాసులు ప్రకటన ద్వారా తెలిపారు. ఈ వైద్య శిబిరంలో ఒంగోలుకు చెందిన స్మార్ట్ విజన్ ఐ హాస్పటల్ వైద్యులు పాల్గొని ఉదయం 9 నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు కంటి పరీక్షలు నిర్వహిస్తారని, ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలంటూ శ్రీనివాసులు తెలిపారు.

అంగన్‌వాడీలో ప్రీ స్కూల్ వర్క్‌షాప్

విశాలాంధ్ర-దొనకొండ: మండలంలోని ఆరవల్లిపాడు అంగన్‌వాడీ కేంద్రంలో సూపర్‌వైజర్ సుభాషిణి ఆధ్వర్యంలో చిన్నారుల తల్లులకు ప్రీ స్కూల్ వర్క్ షాపు శనివారం చేపట్టారు. ఈ సందర్భంగా ఐటీసీ ప్రథమ్ జిల్లా కోఆర్డినేటర్ వెంకట్రావు పాల్గొని చిన్నారుల తల్లులను రెండు గ్రూపులుగా విభజించారు. మొదటి గ్రూపుతో చిన్నారులలో జరిగే శారీరక అభివృద్ధిపై మరియు రెండో గ్రూపుతో శారీరక అభివృద్ధిని పెంచేందుకు కావాల్సిన ఆహార పదార్థాలు మరియు కృత్యాలను చార్ట్‌ల ద్వారా వివరింపజేశారు. ఈ విధానంతో తల్లులకు అవసరమైన అవగాహన అందుతుందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త నాగమణి, ఆయా, తల్లులు పాల్గొన్నారు.

ప్రతి ఉద్యోగికి బదిలీ తప్పదు

ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి

విశాలాంధ్ర-పామూరు : ప్రతి ఉద్యోగికి బదిలీ తప్పదని, విధులు సక్రమంగా నిర్వహించిన చోట ప్రజల ఆదరాభిమానాలు తప్పకుండా పొందు తారని కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. పామూరు సీఐ గా విధులు నిర్వహిస్తున్న ఎం భీమా నాయక్ బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా శుక్రవారం రాత్రి స్థానిక అనిల్ గార్డెన్ ఫంక్షన్ హాలులో సిఐ భీమా నాయక్ కు వీడ్కోలు పలుకుతూ ఎస్ఐ టి కిషోర్ బాబు ఆధ్వ ర్యంలో పౌర సన్మాన సభ జరిగింది. ముఖ్యఅతిథి గా విచ్చేసిన ఎమ్మెల్యే భీమా నాయక్ శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. డాక్టర్ ఉగ్ర మాట్లాడుతూ ఉద్యోగులు ప్రభుత్వానికి ప్రజ లకు వారధిగా ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేసే ప్రతి ఉద్యోగి సమాజంలో గౌరవింపబ డతారని, అలాంటి వారిలో భీమా నాయక్ ఉంటారని కొనియాడారు. పౌర సన్మాన గ్రహీత మాట్లాడుతూ సర్కిల్ పరిధిలోని సిఎస్పురం, పామూరు పట్టణాలలో పెద్దమ్మ తిరునాల, శ్రీ మదన వేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాలు ప్రజలు సహకారంతో అద్భుతంగా నిర్వహించా మన్న సంతృప్తి కలిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కనిగిరి డీఎస్పీ పి సాయి ఈశ్వర్ యశ్వంత్, నూతన సీఐ మాకినేని శ్రీనివాసరావు, కొండపి, కనిగిరి సీఐ లు సోమశేఖర్,ఖాజావలి, వెలిగండ్ల, ఎస్ పురం ఎస్సైలు కృష్ణ పావని, వెంకటేశ్వర నాయక్,డిసిఎంఎస్ చైర్మన్ శ్యామల కాశిరెడ్డి, కనిగిరి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ యారవ రమా శ్రీనివాస్, టిడిపి మండల అధ్యక్షులు బొల్లా నరసింహారావు, టిడిపి మాజీ మండల అధ్యక్షులు పువ్వాడి వెంకటేశ్వర్లు, సిఎస్పురం, పామూరు మాజీ సింగిల్ విండో అధ్యక్షులు బోయళ్ల నారాయణరెడ్డి, కనిగిరి నియోజకవర్గ వాణిజ్య విభాగం అధ్యక్షులు పందిటి హరీష్, దొడ్డ వెంకటసుబ్బారెడ్డి, బైరెడ్డి జయరామిరెడ్డి, ఏఎంసి వైస్ చైర్మన్ పాలపర్తి వెంకటేశ్వర్లు టిడిపి పట్టణ అధ్యక్షులు సయ్యద్ అమీర్ బాబు, టిడిపి మండల ప్రధాన కార్యదర్శి షేక్ హాజీ గౌస్, ప్రభుత్వ వైద్యశాల డైరెక్టర్ ముబీనా మౌలాలి, కొండిశెట్టి వెంకట రమణయ్య, నీటి సంఘం అధ్యక్షులు పాలపర్తి రమణయ్య, కె.వి.ఆర్, మన్నం రమణయ్య, షేక్ కాజా రహమతుల్లా, తిరువీధి జనార్ధన్ తదితరులు పౌర సన్మానంలో పాల్గొని ఘనముగా భీమా నాయక్‌ను సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

విశాలాంధ్ర - సింగరాయకొండ : రోడ్డు ప్రమాదంలో మినీ లారీ బైక్ ను ఢీకొని ఒకరికి తీవ్రమైన గాయాలైన సంఘటన శనివారం చోటు చేసుకుంది. సింగరాయకొండ మండలం రన్ వే రోడ్డు కనుమల్ల గ్రామ సమీపాన, సింగరాయకొండ మండలం కనుమల్ల గ్రామానికి చెందిన కల్లగుంట శ్రీను తండ్రి యానాది హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్న అతను ఇటీవలే సొంత గ్రామానికి వచ్చారు. పట్టణంలో పనులు పూర్తి చేసుకొని కన్నమల్ల గ్రామానికి స్కూటీ ఏపి 27 బి యన్ 7097 వెళు తుండగా అకస్మాత్తుగా వెనుకాల నుంచి అతివేగంగా వస్తున్న ఐచర్ లారీ కె ఏ 04 ఏ ఈ 1209 కంట్రోల్ తప్పి స్కూటీని బలంగా ఢీకొనగా స్కూటీపై ఉన్న కల్లగుంట శ్రీను అనే వ్యక్తికి ఒక కాలు పూర్తిగా విరిగిపోగా తలకి బలమైన రక్త గాయాలు అయ్యాయి. సమాచారం అందుకున్న సింగరాయకొండ ఎస్సై మహేంద్ర వారి సిబ్బందితో కలిసి హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని క్షతగాత్రుని 108 అంబులెన్స్ లో ఒంగోలు రిమ్స్ కు తరలించారు.

హ్యూమన్ రైట్స్ జిల్లా సమన్వయకర్తగా జయకుమార్

విశాలాంధ్ర - సింగరాయకొండ : సింగరాయ కొండ మండలం సుందర్ నగర్ కాలనీకి చెందిన రావినూతల జయ కుమార్‌ను హ్యూమన్ రైట్స్ జిల్లా సమన్వయకర్తగా నియమించినట్లుగా రాష్ట్ర హ్యూమన్ రైట్స్ అధ్యక్షులు శ్రీనివాసరావు శనివారం వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జయ కుమార్ సాంత్వనా సేవ సమితి స్వచ్ఛంద సేవ సంస్థ అధ్యక్షులుగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సేవా రత్న పురస్కారాన్ని అందుకున్నారని, అంతేకాకుండా అనేక స్వచ్ఛంద సేవ సంఘాలలో వివిధ హోదాల్లో పనిచేసి సమాజానికి తన వంతు సేవలను అందిస్తున్నారని,జయ కుమార్ సమాజానికి అందిస్తున్న సేవలను ఆయనలో ఉన్న సేవ తత్పరత, అంకితభావం, సమాజం పట్ల గౌరవం, ముఖ్యంగా బాల్య వివాహాలు, బాల కార్మికులు, బాండెడ్ చైల్డ్ లేబర్, వీధి బాలలు, అరికట్టడంలో విస్తృతంగా తను చేసిన సేవలను, తదితర సద్గుణాలను గుర్తించి హ్యూమన్ రైట్స్ రాష్ట్ర శాఖ అధ్యక్షులు శ్రీనివాసరావు జయ కుమార్ ని జిల్లా సమన్వయకర్తగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు.. హ్యూమన్ రైట్స్ అభివృద్ధికి పేద,నిరుపేదల హక్కుల సాధనకు వారి అభివృద్ధికి అహర్నిశలు జయ కుమార్ కృషి చేస్తారని ఆయన పేర్కొన్నారు. తనకు అప్పగించిన ఈ బాధ్యతను అంకితభావంతో,చిత్తశుద్ధితోఅములు చేసి హ్యూమన్ రైట్స్ ఆశయాలను నెరవేరుస్తానని జయ కుమార్ తెలిపారు.ఈ కార్యక్రమానికి సేవా సంస్థ కార్యకర్తలు పలువురు అభిమానులు పాల్గొన్నారు

ఏంఎస్ఎంఇ పార్క్ ప్రారంభోత్సవ ఏర్పాట్లును ఎమ్మెల్యే పరిశీలన

విశాలాంధ్ర-పామూరు : పి.సి.పల్లి మండలం లింగనపాలెం కు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ నెల 11వ తేదీన ఎంఎస్ఎంఇ పార్క్ ను ప్రారంభో త్సవం చేయనున్నారు. శనివారం సాయంత్రం కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఏర్పాట్లు ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కనిగిరి ఏఎంసీ చైర్మన్ యారవ రమా శ్రీనివాస్, మండల టిడిపి అధ్యక్షులు బొల్లా నరసింహారావు, టిడిపి మండల మాజీ అధ్యక్షులు పువ్వాడి వెంకటేశ్వర్లు, పట్టణ టిడిపి అధ్యక్షులు సయ్యద్ అమీర్ బాబు, కనిగిరి నియోజకవర్గ వాణిజ్య విభాగం అధ్యక్షులు పందిటి హరీష్, పట్టణ తెలుగు యువత అధ్యక్షులు మెంటా నరసింహారావు,సింగిల్ విండో అధ్యక్షు లు ఉప్పలపాటి హరిబాబు, టిడిపి ప్రధాన కార్యదర్శి షేక్ హాజీ గౌస్,మన్నం రమణయ్య, గుంటుపల్లి శ్రీనివాసులు, షేక్ కాజా రహమతుల్లా పాల్గొన్నారు.

రేషన్ షాపులు సక్రమంగా నిర్వహించాలి

విశాలాంధ్ర-సిఎస్ పురం : మండలంలోని రేషన్ షాపులను సక్రమంగా నిర్వహించాలని ఎన్ఫోర్స్‌మెంట్ డిటి భూపతి, ఫుడ్ ఇన్స్పెక్టర్ వాడ మనోహర్ రెడ్డి తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని సి.ఎస్.పురం ప్రాంతంలోని మూడు రేషన్ షాపులు, చింతపూడి గ్రామంలోని రేషన్ షాపును ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా రేషన్ సక్రమంగా పంపిణీ జరుగుతున్నదా లేదా అని పరిశీలించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రేషన్ సరుకులు 15వ తేదీ లోపు రేషన్ పంపిణీ చేసే విధంగా ప్రజలకు సక్రమంగా, సమ యానికి అందజేయాలని డీలర్లకు సూ చించారు. అలాగే రేషన్ షాపుల్లో సరుకుల లభ్యత, పంపిణీ రికార్డులు, తూకాలు తదితర అంశాలను పరిశీలించారు. స్మార్ట్ కార్డుల ప్రాసెస్ పూర్తిచేయడంలో ఆలస్యం చేయ రాదని, ప్రతి లబ్ధిదారుడికి సరుకులు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అవినీతి జరిగినట్లయితే అట్టివారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా రేషన్ పంపిణీ వ్యవస్థను పారదర్శకంగా నిర్వహించా లని సూచించారు ఈ కార్యక్రమంలో ఆయా షాపుల డీలర్లు పాల్గొన్నారు.

ఐఐటీ-ఒలింపియాడ్ పోటీల్లో సత్తా చాటిన నలంద విద్యార్థులు

విశాలాంధ్ర-యర్రగొండపాలెం : నలంద హైస్కూల్ విద్యార్థులు ఈ అభ్యాస్ అకాడమీ, హైదరాబాద్ వారు రెండు తెలుగు రాష్ట్రాలలో నిర్వహించిన ఈ అభ్యాస్ ఐఐటీ-ఒలింపియాడ్ అంతర్రాష్ట్ర పోటీ పరీక్షలలో రెండు తెలుగు రాష్ట్రాలనుండి 1000 మంది విద్యార్థులు పాల్గొనడం జరిగింది. ఈ పరీక్షలలో యర్రగొండపాలెం నలంద స్కూల్ విద్యార్థులు ఆర్య భట్ట మెంటల్ ఎబిలిటీ టెస్ట్ నందు రాష్ట్ర స్థాయిలో 100 మార్కులకు గాను 96 మార్కులతో 9వ తరగతి నుండి బి.వరుణ్ రెడ్డి మూడవ ర్యాంకు, 90 మార్కులతో 6వ తరగతి నుండి బి.సౌజన్య మూడవ ర్యాంకు చాణక్య బిజినెస్ ఆప్టిట్యూడ్ టెస్ట్ నందు 8వ తరగతి నుండి ఆర్ వి శివకుమార్ 96 మార్కులతో మొదటి ర్యాంకు, 6వ తరగతి 92 మార్కులతో బి.సౌజన్య మూడవ ర్యాంకు సాధించడం జరిగింది. ఈ సందర్భంగా డైరెక్టర్ మేకల రామకృష్ణారెడ్డి, కరస్పాండెంట్ మేకల పద్మజ ఓబులరెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పెమ్మ సాయి చంద్రహాస రెడ్డి, ఉత్తమ ప్రతిభ కనపరచిన విద్యార్థులను, వారికి శిక్షణ ఇచ్చిన ఉపా ధ్యాయులను అభినందించడం జరిగింది.

రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం మండల నూతన కార్యవర్గం ఎంపిక

విశాలాంధ్ర - బేస్తవారిపేట : స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం మండల రాష్ట్ర ఉపాధ్యాయ సంఘ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల శాఖ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. అధ్యక్షులుగా పి. రామచంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కె. ప్రభాకర్ రావు, గౌరవాధ్యక్షులుగా డి. హుస్సేన్, ఆర్థిక కార్యదర్శిగా బాలకేశవులు, మహిళా ఉపాధ్యక్షురాలుగా వైవీ విజ యలక్ష్మిదేవి, కార్యదర్శిగా కప్పల చంద్రశేఖర్, అసోసియేట్ అధ్యక్షులుగా బి. ప్రదీప్ కుమార్, ఉపాధ్యాయ కన్వీనర్ గా టి. దశరథ రామిరెడ్డి, జిల్లా కౌన్సిలర్లుగా ఎస్‌కె ఖాసీంవలి, ఎ. అనురాధ లను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. ఎన్నికల అధికారిగా డి. వెంకటేశ్వర్లు, ఎన్నికల పరిశీలకులుగా డి. సిద్దిక్ లు వ్యవహరించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు కె. ఎర్రయ్య ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈనెల 14వ తేదీన ఢిల్లీలోని జంతర్ మంతర్ లో ధర్నా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం మండల శాఖా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఐవీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నాగేశ్వరరావు

విశాలాంధ్ర-యర్రగొండపాలెం : ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ (ఐవిఎఫ్) రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా యర్రగొండపాలెంకు చెందిన ఆధ్యాత్మిక సేవకుడు, కళా విభూషణ్ డాక్టర్ చీదెళ్ల నాగేశ్వ రరావును నియ మించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ తనపై విశ్వాసంతో ఈ పదవి అప్పగించిన అంత ర్జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ ఉప్పల శ్రీనివాస్ గుప్త, రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు దూండీ రాకేష్,రాష్ట్ర అధ్యక్షుడు కోనా శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి గొంట్ల రామ్మోహనరావు లకు కృతజ్ఞతలు తెలిపారు. సంఘం బలోపేతం కోసం కృషి చేస్తానని తెలిపారు.

ముంపు పొలాల పరిశీలన

విశాలాంధ్ర-పెద్దారవీడు : మొంథా తుఫాన్ వల్ల మద్దెల కట్ట గ్రామంలోని శేషమ్మ చెరువు అలుగు పారి పొలాల గుండా నీళ్లు పారుతూ నష్టపోయిన పంట పొలాలను శనివారం మార్కా పురం సహాయ విశ్వసంచాలకులు బాలాజీ నాయక్ రైతులతో కలిసి పరిశీలించారు. రైతులు మాట్లాడు తూ తుఫాను తర్వాత గండిచెరువు చెరువు అలుగు నుండి వస్తున్న నీటి ప్రవాహం వల్ల గ్రామంలోని శేషమ్మ చెరువు నిండి అలుగు పారుతుందని, గత ఐదు ఆరు రోజుల నుండి మిరప, పొగాకు పొలాలు మిరప పొగాకు పంటలు సుమారు వంద ఎకరాలు నీటి లోనే ఉన్నాయని అవన్నీ కూడా చేతికి రావని తెలిపారు. ఏడిఏ వెంట వ్యవసాయ అధికారులు లక్ష్మీనారాయణ జ్యోష్ణ దేవి వ్యవసాయ విస్తరణ అధికారి దేవేంద్ర గౌడ్ పాల్గొన్నారు.

Form No. 22 and 18

General Notice in respect of interlocutary Application and Notice for appearance in Appeals Order 41 Rule 14 CPC, and Rules 1,2,4 and 11 of Chapter IV Karnataka High Court Rules

IN THE HIGH COUNT OF KARNATAKA AT BENGALURU

MFA No. 346/2025 (KPIDFA/SJ)

Appellant : SRI D. RAVINDARA, AGED ANDUT 52 YEARS S/O M D MUNIYAPPA, NO 40, 3RD CROSS, BRINDAVAN LAYOUT, HORAMAVU BENGALURU 560043

By Sri ATHMA V. HIREMATH, ADVOCATE V/S

Respondent/s 1. THE COMPETENT AUTHORITY FOR M/S MYTRI PLANTATION AND HORTICULTURE PRIVATE LTD. AND THE SPECIAL DEPUTY COMMISSIONER - 1, BENGALURU URBAN DISTRICT AND OTHERS

Appeal From the Judgement/Award/Order passed on 21.04.2023 in MISC. NO.1552/2022 ON THE FILE OF THE XCI ADDL. CITY CIVIL & SESSIONS JUDGE AND SPL JUDGE FOR KPIDFE CASES BENGALURU CCH-92, IA NO. 1/2025 FOR CONDONE THE DELAY OF 600 DAYS FILED IN THE ABOVE APPEAL.

To : R2 TO R4

2. M/S MYTHRI PLANTATION AND HORTICULTURE PRIVATE LIMITED HAVING OFFICE AT NO 5-379, SINDHOORA ARCADE, ONGAL CITY, PRAKASHAM DISTRICT, ANDRA PRADESH STATE, 523001 REPRESENTED BY SRI LAKKU KONDA REDDY, S/O LAKKU MALKONDA REDDY

3. SRI K BRAHMA REDDY S/O K KRISHNA REDDY, AGED ABOUT 35 YEARS, R/O ANNAVARAM POST, JALADANKI MANDALAM, NELLUR DISTRICT, ANDRA PRADESH

4. SRI LAKKUMALYADRI REDDY, S/O MALKONDA REDDY, AGED ABOUT 40 YEARS, NO 5-37 (1), MASTER MANSION, OPPOSITE POWER OFFICE, KURNOOL ROAD, ONGOL, PRAKASHAM DISTRICT, ANDRA PRADESH 523002

Whereas the aforementioned Appeal preferred has been registered by this Court.

NOTICE IS HEREBY given to you to appear in this Court in person or through an Advocate duly instructed or through some one authorised by law to act for you in this case on **28/11/2025 at 10.30 a.m.,** in case you intend to contest the appeal. If you fail so to appear, the appeal will be dealt with, heard and decided in your absence.

Given under my hand and the seal of this court on 27TH DAY OF OCTOBER 2025.

By Order of the Court

Sd/- Assistant Registrar

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే ఏలూరి శ్రీకారం

విశాలాంధ్ర - కారంచేడు : కారంచేడు మండలం కుంకలమర్రు గ్రామంలో పలు అభివృద్ధి పనులను పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు శనివారం ప్రారంభించారు. గ్రామ అభివృద్ధి లక్ష్యంగా రూ. 80 లక్షల వ్యయంతో సీసీ రోడ్లకు ఎమ్మెల్యే శంకుస్థాపన,ప్రారంభోత్సవం చేశారు. తొలుత ఎమ్మెల్యే ఏలూరికి గ్రామస్తులు బాణాసంచా కాలుస్తూ,పూలమాలతో ఘన స్వాగతం పలికారు. గ్రామ ప్రవేశద్వారం వద్ద ఉన్న స్వర్గీయ నంద మూరి తారకరామారావు విగ్రహానికి ఎమ్మెల్యే ఏలూరి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం గ్రామంలోని చెన్నకేశవస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, గ్రామ ప్రజల శ్రేయస్సు కోసం అభిషేకం చేయించారు. గ్రామ శివారులో నిర్మితమవుతున్న మహాప్రస్థానం వద్ద కైలాసనాథుని విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉన్నదని ఎమ్మెల్యే ఏలూరి తెలిపారు. రోడ్లు,నీటి వసతులు,విద్యుత్,శానిటేషన్ తదితర విభాగాల్లో కుంకలమర్రును అభివృద్ధి పథంలో నడిపేందుకు ప్రత్యేక ప్రణాళికతో పని చేస్తామని చెప్పారు. ప్రజలతో సమిష్టిగా గ్రామాభివృద్ధిని ముందుకు తీసుకెళ్తామని ఏలూరి సాంబశివ రావు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు శ్రీహరి,కాసిం,మాల కార్పొరేషన్ చైర్మన్ విజయ్ కుమార్, నాయకులు బంగారు బాబు, శేషయ్య, రాఘవయ్య, మణికంఠ, శ్రీనివాస రావు, శోభన్ తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

- సీనియర్ సివిల్ జడ్జ్ ఎస్పీడీ వెన్నెల

విశాలాంధ్ర-రేపల్లె : రేపల్లె న్యాయ స్థానంలో శనివారం జాతీయ న్యాయ సేవా దినోత్సవం సందర్భంగా న్యాయ చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జ్ ఎస్పిడి వెన్నెల, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి దేవి సాయి శ్రీ వాణి, అదనపు జూనియర్ సివిల్ జడ్జి గీత భార్గవిలు న్యాయ సేవ చట్టాలపై న్యాయవాదులకు చట్టాలలోని ముఖ్య మైన సంఘటనలను వివరించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జీవి గిరిధర్, న్యాయవాదులు, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు

విశాలాంధ్ర-చెరుకుపల్లి : విద్యార్థినీ విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించాలి అనే ఉద్దేశంతో ఈనెల 7,8 తేదీల్లో చెరుకుపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారని మండల విద్యాశాఖ అధికారి టి నవీన్ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో చుండూరు, వేమూరు, కొల్లూరు, అమృతలూరు, చెరుకుపల్లి మండలాలకు చెందిన 59 మంది ఉపాధ్యాయులు హాజరయ్యారన్నారు. ఉపాధ్యాయులలో బోధనా సామర్థ్యం పెంపొందించుకునేందుకు ఈ శిక్షణ తరగతులు దోహద పడతాయన్నారు. కార్యక్రమానికి కోఆర్డినేటర్లుగా మండల విద్యా శాఖ అధికారి పులి లాజర్, డి నవీన్ కుమార్ వ్యవహరించారు. రిసోర్స్ పర్సన్ గా మొహమ్మద్ అక్రమ ఘోరీ, ఆర్ శ్రీధర్, సిహెచ్ శ్రీనివాసరావు, జి బాలసుందరం, వ్యవహరించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా కోఆర్డినేటర్లు కే శివకుమార్, అబ్రహాం లింకన్ సందర్శించి తమ సూచనలు అందించారు.

డ్యూటీలు వద్దు.. జరిమానాలే ముద్దు

విశాలాంధ్ర-చెరుకుపల్లి : శాంతి భద్రతలను కాపాడడానికి నియమించబడిన పోలీసు వ్యవస్థ ప్రస్తుతం వాహనదారుల దగ్గర జరిమానాలు వసూలు చేస్తూ కాలక్షేపం చేస్తున్నారు. మండల పరిధిలో రోజు ఏదో ఒక చోట దొంగతనాలు జరుగుతున్నప్పటికీ పట్టించుకోకుండా రోజు ఏదో ఒక మార్గంలో వాహనా లను ఆపి వారి వద్ద నుండి భారీ మొత్తంలో జరిమానాలు వసూలు చేస్తు న్నారు. డీజీపీ, ఎస్పీ తదితర ఉన్నతాధికారుల ఆదేశాలంటూ ఒక్కొక్క వాహనం దగ్గర నుండి 1035 నుండి డ్రంక్ అండ్ డ్రైవ్ లో అయితే 10,000 వరకు జరిమానాలు విధిస్తున్నారు. కూలీ నాలి చేసుకొని జీవనం సాగించే సన్న కారు ప్రజలు జరిమానాలతో బెంబేలెత్తిపోతున్నారు. రోడ్ల మీదకు రావాలంటేనే భయపడే పరిస్థితిని కల్పించారు. పోలీసు ఉన్నతాధికారులు ఏదైనా సందర్భంలో వచ్చినప్పుడు గస్తీని ముమ్మరం చేస్తాం దొంగతనాలు అరికడతాం అంటూ ప్రకటనలు ఇస్తున్నారు తప్ప ఆచరణలో మాత్రం అమలకు నోచుకో వటం లేదు. పోలీస్ సిబ్బంది కూడా రాత్రివేళ గస్తీలు, మరోచోట డ్యూటీలు అంటూ అటూ ఇటూ తిరగటం కంటే రోడ్ల పైన వాహనాలపై కాలక్షేపం చేయడమే నయమనే పరిస్థితికి వచ్చారు. ఏదైనా వాహనం పోలీసులు ఆపి ఆ వాహ నాన్ని పోలీస్టేషన్ కు తరలించి అపరాధ రుసుము కట్టేందుకు సిద్ధపడిన ఎస్సై గారు వచ్చేవరకు ఆగాలని గంటల తరబడి స్టేషన్ ప్రాంగణంలో కూర్చోబెడుతున్నారు. ఉన్నతాధి కారులు తమకు లక్ష్యాలను నిర్దేశించి తప్పనిసరిగా అమలు పరచాలని సూచనలు ఇస్తున్నారని దీనిలో మేం చేసేదేమీ లేదని పోలీసులు చెబుతున్నప్పటికీ వీరి చర్యల వల్ల ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు కేవలం జరిమానాలపై కాకుండా శాంతి భద్రతలపై కూడా దృష్టి సారి ప్రజలు కోరుతున్నారు.

జూనియర్ ఏపీ స్టేట్ టెన్నికాయిట్ పోటీలు ప్రారంభం

విశాలాంధ్ర-చీరాల : పట్టణం లోని ఎన్.ఆర్-పిఎం హైస్కూల్ ప్రాంగణంలో 42వ ఆంధ్రప్రదేశ్ ఇంటర్ డిస్టిక్ జూనియర్ స్టేట్ టెన్నికాయిట్ 2025-26 బాల, బాలికల క్రీడా పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. శనివారం జరిగిన ప్రారంభ సమావేశానికి చీరాల శాసనసభ్యులు మద్దులూరి మాల కొండయ్య ముఖ్య అతిథిగా హాజరై క్రీడా పోటీలను ప్రారంభించారు. విద్యార్థి జీవితంలో చదువు ఎంత ముఖ్యమో, అదే స్థాయిలో క్రీడలకు కూడా ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. క్రీడల ద్వారా శారీరక దారుఢ్యం పెరుగుతుందని, మానసిక ఉల్లాసం వస్తుందని, జట్టు స్ఫూర్తి ఏర్పడుతుందని అన్నారు. చిన్న వయస్సు నుంచే క్రీడలలో పాల్గొనే అలవాటు పెంచుకోవాలని శాసన సభ్యులు పిలుపునిచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల నుండి వచ్చిన బాల, బాలికల జట్లు పోటీలలో పాల్గొంటున్నాయని నిర్వాహకులు తెలిపారు. రాష్ట్ర స్థాయి క్రీడల్లో చీరాల ఆతిథ్యం ఇవ్వడం గర్వకారణమని పేర్కొన్నారు. ఆర్గనైజింగ్ స్టాఫ్, కోచింగ్ టీమ్ సభ్యులు, విద్యాసంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

సెల్ టవర్ ఎక్కిన యువకుడు

విశాలాంధ్ర-బల్లికురవ : మండలంలో మల్లయ్య పాలెం గ్రామంలో ఓ గ్రానైట్ క్వారీలో పని చేస్తున్న వంగూరి రాజేష్ అనే యువకుడిని పని నుంచి తొలగి ంచారని మనస్తాపంతో సెల్ టవర్ ఎక్కి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. సమాచారం తెలుసుకున్న బల్లికురవ ఎస్సై సంఘటన స్థలానికి వెళ్లి ఆ యువకుడితో మాట్లాడి సెల్ టవర్ నుంచి దిగటంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

న్యాయవాదుల కార్తీక వన సమారాధన

విశాలాంధ్ర-రేపల్లె : పవిత్రమైన కార్తీక మాసం సందర్భంగా రేపల్లె న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో రెండవ శనివారం ఓల్డ్ టౌన్ లోని జమీం దారు కోట నందు కార్తీక వనసమారాధన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఆహ్లాదకర వాతావరణంలో న్యాయవాదులు, న్యాయవాద గుమస్తాలు, బార్ అసోసియేషన్ అధ్యక్షులు జీవీ గిరిధర్ దంపతులు, న్యాయవాది బుర్లె చంద్రశేఖర్ దంపతులు పూజా కార్యక్రమం నిర్వహించారు. ఈనెల 20వ తేదీతో కార్తీక మాసం ముగుస్తున్న నేపథ్యంలో కార్తీక వన సమారాధనలు శివాలయాల ప్రాంగణంలో, తోటలలో నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు వెన్నెల సాయి శ్రీవాణి గీతా భార్గవి ముఖ్య అతిథులుగా హాజరైనారు. న్యాయవాదుల సంక్షేమ సంఘం అధ్యక్షులు గిరిధర్, కార్యదర్శి శ్రీనివాసరావుల పర్యవేక్షణలో ఆహ్లాద కర వాతావరణంలో జరిగింది. ఏజీపీలు ఏ శ్రీనివాసమూర్తి, జీ వెంకటేశ్వర రావులు, తోపాటు న్యాయవాదులు న్యాయవాద గుమస్తాలు, కోర్టు ఉద్యోగులు, సిబ్బంది, మహిళా న్యాయవాదులు, కుటుంబ సభ్యులతో సమారాధనలో పాల్గొన్నారు.

టెలివిజన్, పత్రికలు దైనందిన ప్రవర్తనపై ప్రభావితం

విశాలాంధ్ర-అద్దంకి : ఆధునిక యుగంలో మానవ జీవితానికి మీడియాకి విడదీయరాని బంధం ఉందని ప్రముఖ కవి విశ్రాంత ప్రధానోపాధ్యాయులు పుట్టం రాజు శ్రీరామచంద్రమూర్తి అన్నారు. సాహితీ కౌముది ఆధ్వర్యంలో స్థానిక పుట్టం రాజు కళాక్షేత్రంలో శనివారం డా, నాగసూరి వేణుగోపాల్ రాసిన గ్రంథాలపై విశ్లేషణాత్మక పరిచయ కార్యక్రమం జరిగింది. పుట్టం రాజు మాట్లాడుతూ టెలివిజన్ పత్రికలో రేడియో సోషల్ మీడియా వంటి వేదికలు మానవుని ఆలోచనలు విలువలను దైనందిన ప్రవర్తనను ప్రభావితం చేస్తున్నాయన్నారు. ఈ పరిణామాలను నిశితంగా గమనించి శాస్త్రీయ దృక్పథంలో సమీక్షించి గ్రంథాలను రాసిన రచయిత జర్నలిస్ట్ డా. నాగసూరి వేణుగోపాల్ అన్నారు. గాడేపల్లి దివాకర దత్తు ఇలా పావులూరి శేష తల్పసాయి, శ్రీమన్నారాయణ పాల్గొన్నారు.

విద్యార్థుల తల్లిదండ్రుల ఆత్మీయ సమావేశం

విశాలాంధ్ర - వేటపాలెం : బండ్ల బాపయ్య హిందూ జూనియర్ కాలేజీ (హై స్కూల్ విభాగం)లో తొమ్మిదో, పదో తరగతి చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రుల ఆత్మీయ సమావేశం శనివారం జరిగింది. తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సమావేశానికి అధ్యక్షత వహించిన కాలేజీ కరస్పాం డెంట్ చల్లా వాసుదేవరావు మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు అగస్త్య ల్యాబ్, డిజిటల్ తరగతులు వంటి ఆధునిక సౌకర్యాలు ఏర్పాటు చేశామని తెలిపారు. జాయింట్ సెక్రటరీ బండ్ల రవీంద్ర నాథ్ మాట్లాడుతూ తల్లిదండ్రులు ఉపాధ్యాయులు సమన్వయంతో కృషి చేయడం వల్లే ఈ కళాశాల నుండి ఉన్నత విలువలు కలిగిన విద్యార్థులు జిల్లాస్థాయిలో ర్యాంకులు సాధిస్తున్నారని అన్నారు. ప్రిన్సిపాల్ గంగాధరరావు మాట్లాడుతూ నేటి 10వ తరగతి చదువుతున్న విద్యార్థుల కోసం రాబోయే విద్యా సంవత్సరం నుండి ఎం.ఈ.సి.ఐదు సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ కోర్సును ప్రవేశపెడుతున్నామని పేర్కొన్నారు. విద్యార్థులను భవిష్యత్ లో చార్టర్డ్ అకౌంటెంట్లుగా తీర్చిదిద్దగలమని, తల్లిదండ్రులు పిల్లలను ఆ గ్రూపులో చేర్చాలని సూచించారు. కాలేజీ అధ్యాపక బృందం, ఇంగ్లీష్ మీడియం బి.హెచ్.సుబ్బారావు పాల్గొన్నారు.

ఏ.ఐ.ఎం. నూతన అధ్యక్షుడిగా సుందరరావు

విశాలాంధ్ర-కారంచేడు : కారంచేడు గ్రామస్థుడు గర్నెపూడి సుందర రావును అంబేద్కర్ ఇండియా మిషన్ (ఏఐఎం) పర్చూరు నియోజకవర్గ నూతన అధ్యక్షుడిగా ఏ.ఐ.ఎం. సుప్రీం పి.వి. సునీల్ కుమార్ ఐపీఎస్ (డి.జి) నియమించారు. ఈ మేరకు ఏ.ఐ.ఎం. కార్యకర్తలలో ఉత్సాహం నెలకొంది. ఈ సందర్భంగా ఏ.ఐ.ఎం. రాష్ట్ర నాయకులు మాట్లాడుతూ "మన వాడ, మన పంచాయితీ, మన పాలన" కు ఆధారంగా గ్రామ స్థాయి నుండి రాజ్యాంగ హక్కులపై అవగాహన, సామాజిక విధానాలపై ప్రజా చైతన్యం పెంపొందించే సదస్సులు నిర్వహించాలని సూచించారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చూపిన మార్గంలో సామాజిక న్యాయం, రాజ్యాంగ విలువలు, సమాన హక్కుల సాధనకై ప్రజలతో కలిసి పని చేయాలని కొత్త అధ్యక్షుడికి పిలుపునిచ్చారు. "ప్రజల మధ్యకు వెళ్లి రియల్ గ్రౌండ్ వర్క్ చేయాలన్నారు. పర్చూరు నియోజకవర్గంలో ఏ.ఐ.ఎం. పునర్వ్యవస్థీకరణకు కొత్త నాయకత్వం మరింత బలోపేతం చేస్తుందని నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రత్యేక జైభీమ్ నినాదాలతో కార్యక్రమం ముగిసింది.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

విశాలాంధ్ర - చెరుకుపల్లి : రోడ్డు ప్రమాదంలో యువకుడు గాయపడిన సంఘటన జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే స్థానిక కొత్తపేటకు చెందిన గంజి అనిల్ ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తూ లారీ ఢీకొనడంతో కిందపడి గాయాల పాలయ్యాడు. స్థానిక పోలీసులు వెంటనే అతనిని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించగా మెరుగైన వైద్యం కోసం గుంటూరు హాస్పటల్ కు తరలించారు.

అప్పుల బాధతో రైతు మృతి

విశాలాంధ్ర -బల్లికురవ : మండలంలోని నక్క బొక్కలపాడు గ్రామంలో అప్పుల బాధ తట్టుకోలేక వంకం వీరాంజనేయులు (60)సంవత్సరాలు పురుగు మందు తాగి శనివారం సాయంత్రం నాలుగు గంటలకు ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడుకి ఇద్దరు సంతానం ఉన్నారు.

ఎస్టీయూ నూతన కమిటీ ఎన్నిక

విశాలాంధ్ర - చీరాల రూరల్ : రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం చీరాల పట్టణ శాఖ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఎస్టీయూ చీరాల పట్టణ శాఖ అధ్యక్షునిగా జి.ఎన్ రాజకుమార్,ప్రధాన కార్యదర్శిగా జీవి సుబ్బారెడ్డి, ఆర్థిక కార్యదర్శిగా పేరం సుబ్బారావులను,ఇతర సభ్యులను ఎన్నుకున్నారు.ఈ కార్యక్రమంలో బాపట్ల జిల్లా అధ్యక్షులు బడుగు శ్రీనివాస్ పాల్గొన్నారు.ఆయన మాట్లాడుతూ ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్‌నుండి మినహాయింపు ఇవ్వాలని, ఉపాధ్యాయులకు బోధనేతర పనులు రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర ఆర్థిక కమిటీ సభ్యులు వి.ప్రభాకర్ రావు,చీరాల మండల బాధ్యులు ఏసురత్నం, బి.వెంకటేశ్వర్లు, కే.సుబ్బారావు పాల్గొన్నారు.

తుఫాన్ బాధితులకు అండగా సాయం

- రూ.3వేలు ఆర్థిక సాయం,బియ్యం పంపిణీ

విశాలాంధ్ర -వేటపాలెం:మొంథా తుఫాన్ ప్రభావంతో నష్టపోయిన కుటుం బాలకు సహాయం అందిస్తూ పాపాయిపాలెం గ్రామంలో శనివారం సహాయక కార్యక్రమం నిర్వహించారు.చీరాల ఎమ్మెల్యే మద్దులూరి మాల కొండయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో తుఫాన్ సమయంలో ఇళ్లకు నష్టం కలిగిన పూరి ఇళ్లవారు తాత్కాలికంగా షెల్టర్‌లో నివసిస్తున్నందున, ప్రభుత్వ టీడీపీ పాలనలో భాగంగా ఒక్క కుటుంబానికి రూ.3వేలు చొప్పున ఆర్థిక సాయం, బియ్యం పంపిణీ చేయడం చేశారు.స్థానిక ప్రజలకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, తక్షణ స్పందనతో సహాయం అందించే లక్ష్యమే ముఖ్య మని నాయకులు పేర్కొన్నారు. తుఫాన్ దెబ్బ వల్ల ఆదాయం కోల్పోయిన కుటుంబాలకు ఈ సాయం కొంత ఉపశమనం కలిగిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో పులి హరికృష్ణ, పులి వెంకటేశ్వర్లు, పులి వెంకట నారాయణ, గవిని పోతురాజు, పులి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నేడు రాంబట్లపాలెంలో ఉచిత వైద్య శిబిరం

విశాలాంధ్ర -చెరుకుపల్లి : శ్రీ వాసిరెడ్డి సుబ్బారావు హాస్పిటల్ రాంబట్ల వారి పాలెం గ్రామంలో నేడు ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు వైద్యులు డాక్టర్ వాసిరెడ్డి విశ్వక్సేన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు అన్ని రకాల వ్యాధులు ఉన్నవారికి ఉచితంగా పరీక్షలు నిర్వహిస్తామన్నారు. శస్త్ర చికిత్స చేయించుకునే వారికి ప్రత్యేకంగా రక్త పరీక్షలు 30 శాతం రాయితీ, శస్త్ర చికిత్స ఫీజులు 25 శాతం రాయితీ కల్పిస్తున్నట్లు ఆయన తెలిపారు. అంతేకాకుండా షుగర్ పరీక్ష ఉచితంగా నిర్వహిస్తామని థైరాయిడ్ పరీక్ష కేవలం 50 రూపాయలకే నిర్వహిస్తామని ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని పరిసర ప్రాంత ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

ఆస్టర్ రమేష్ హాస్పిటల్ ప్రారంభం

- పేదలకు నాణ్యమైన కార్పొరేట్ వైద్యం
- రమేష్ హాస్పిటల్ ఎండి పోతిన రమేష్

విశాలాంధ్ర - ఇంకొల్లు : ఇంకొల్లు నూతనంగా నిర్మించిన ఆస్టర్ రమేష్ హాస్పిటల్‌ను శనివారం ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ప్రారంభించారు. తొలుత ఎమ్మెల్యే ఏలూరికి హాస్పిటల్ యాజమాన్యం పూర్ణకుంభంతో వేద పండితుల ఆశీర్వచనాలతో స్వాగతం పలికారు.అనంతరం ఆస్పత్రిలో పలు విభాగాలను ఎండి రమేష్ బాబుతో కలిసి ఆయన ప్రారంభించారు.అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజల చెంతకే కార్పొరేట్ వైద్య సేవలు అందించడం అభినందనీయం అన్నారు.పేదలకు నాణ్యమైన కార్పొరేట్ వైద్యం అందించేందుకు ఇంకొల్లులో హాస్పిటల్ బ్రాంచ్ ని ఏర్పాటు చేయడం శుభ పరిణామం అన్నారు.గత అనేక దశాబ్దాలుగా ఆస్టర్ రమేష్ హాస్పటల్ సామాన్య ప్రజలకు సైతం కార్పొరేట్ సేవలందిస్తూ మనలను పొందినట్లు తెలిపారు. ఎమ్మెల్యే ఏలూరి ఆస్టర్ రమేష్ హాస్పిటల్ సిఎస్ఆర్ ఫండ్ కింద ఈ ప్రాంతంలో ప్రభుత్వ వైద్యశాలలను ఆధునికరణ అభివృద్ధి చేసేందుకు తమ వంతు సహకారం అందించాలని కోరారు.ఈ సందర్భంగా ఆస్టర్ రమేష్ హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ పోతిన రమేష్ బాబు మాట్లాడుతూ ఇంకొల్లు పరిసరాల్లో క్వాలిటీ మెడికల్ సర్వీసులు అవసరమని చాలా కాలంగా ప్రజలు కోరుకుంటున్నారు. ఆ అవసరాన్ని తీర్చేందుకు ఆధునిక పరికరాలు, అత్యవసర సేవలు, నిపుణుల వైద్య సేవలతో హాస్పిటల్‌ను విస్తరించాం, ప్రజలకు తక్కువ ఖర్చుతో అత్యుత్తమ చికిత్స అందించడం మా లక్ష్యం అని తెలిపారు. కార్యక్రమంలో మాల కార్పొరేషన్ చైర్మన్ విజయ్ కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ గుంజి వెంకట్రావు, నాయకులు నాయుదు హనుమంతరావు, కర్రి శ్రీనివాస రావు, బోడెంపూడి సుబ్బారావు, సాంబయ్య, ఆస్టర్ రమేష్ హాస్పిటల్ యాజమాన్యం మమత, కార్తీక్, భరత్, వైద్య బృందం పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందనలు వెల్లువ

- జిల్లా స్కిల్ పోటీల్లో ఏఐ ప్రాజెక్టు కు రెండో స్థానం

విశాలాంధ్ర - సంతమాగులూరు : ఏల్చూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని విద్యార్థులు బాపట్ల జిల్లా స్థాయి వృత్తి విద్యా పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఈనెల 7న బాపట్లలో జరిగిన ఐటీ, ఐటీఈఎస్, ఆటోమోటివ్ ట్రేడ్ విద్యా ర్థులు జిల్లా స్థాయి స్కిల్ కాంపిటీషన్ నందు ఐటీ, ఐటీఈఎస్ ట్రేడ్ ద్వారా రూపొందించిన ఏఐ మోడల్ ప్రాజెక్టు రెండో స్థానాన్ని కైవసం చేసుకుంది. శనివారం ప్రధానోపాధ్యాయిని కె.మాధవి పుష్పమి అధ్యక్షతన ఉపాధ్యాయులు విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం హెచ్ఎం మాట్లాడుతూ ఈ ప్రాజెక్టు రూపకల్పనలో భాగస్వాములైన ఐటీ, ఐటీఈఎస్ విభాగం నుంచి 10వ తరగతి విద్యార్థినులు కొలిశెట్టి అన్విత, మామిడాల నరేష్, షేక్ సులేమాన్, 9వ తరగతి విద్యార్థిని నారదాసు తనుశ్రీ ప్రతిభను కొనియాడారు. ఆటోమోటివ్ ట్రేడ్ నుంచి 10వ తరగతి విద్యార్థులు మందా కృపాశేఖర్, వల్లెం భారత్ కుమార్, పుచ్చకాయల విష్ణు యాదవ్, తొగటి హర్షవర్ధన్ బృందం రూపకల్పన చేసిన "ట్రాన్స్‌మిషన్, స్టీరింగ్, హైడ్రాలిక్ బ్రేకింగ్ సిస్టమ్" ప్రాజెక్టులు సైతం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ప్రదర్శించారని పేర్కొన్నారు. విద్యార్థుల్లో దాగివున్న ప్రతిభను వెలికి తీయడమే కాకుండా జిల్లాలో ఏల్చూరు జడ్పీ ఉన్నత పాఠశాలకు పేరు ప్రఖ్యాతులు వచ్చేందుకు కృషి చేసిన ఐటీ, ఐటీఈఎస్ ట్రేడ్ ట్రైనర్ మురిగిపూడి నాగ శ్రీను, ఆటోమోటివ్ ట్రేడ్ ట్రైనర్ వేటూరి నరేంద్రలను కూడా అభినందించారు.

వైద్యాన్ని ప్రైవేటుపరం చేసే ప్రభుత్వ నిర్ణయం విరమించుకోవాలి

- మాజీ డిప్యూటీ స్పీకర్, మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి
- 12న బాపట్లలో వైసీపీ ప్రజా ఉద్యమ ధర్నా

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : పీపీపీ పద్ధతిలో మెడికల్ కాలేజీలను నిర్మాణం చెయ్యాలని కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఈ నెల 12న జరుగు నిరసన ధర్నాకు వైసీపీ నాయకులు, కార్యకర్తలు,అభిమానులు ప్రతి ఒక్కరు తరలిరావాలని మాజీ డిప్యూటీ స్పీకర్,మాజీ ఎమ్మెల్యే కోన రఘు పతి పిలుపునిచ్చారు.ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రేవేటీకరణకు వ్యతిరేకంగా వైసీపీ ప్రజా ఉద్యమం పోస్టర్‌ను పార్టీ ముఖ్య నాయకులుతో కలసి ఆవిష్కరిం చారు.ఈ సందర్భంగా కోన రఘుపతి మాట్లాడుతూ వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ నెల 12న ఉదయం 10 గంటలకు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం దగ్గర నుంచి బాపట్ల తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించడం జరుగుతుందని అనంతరం తహశీల్దార్‌కి వినతిపత్రం ఇస్తా మని తెలిపారు. వైద్యాన్ని ప్రైవేటుపరం చేసే ప్రభుత్వనిర్ణయం విరమించుకో వాలని, వైద్యవిద్యను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని,మెడికల్ కాలే జీలా ప్రైవేటీకరణ నిలిపివేసి ప్రభుత్వమే నిర్మించాలన్నారు.ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరించడానికి నిరసిస్తూ అనేకచోట్ల రాజకీయాలకు అతీతంగా ప్రజలు, మధ్యతరగతి మేధావులు అనేక వేదికలుగా ప్రభుత్వం నిర్ణయాన్ని మార్చుకోవాలని నిరసన తెలుపుతున్నారు.అయినా రాష్ట్రప్రభుత్వం స్పందించకుండా అర్థంలేని వాదనలు,అబద్దాలు ప్రచారం చేస్తూ ప్రైవేటీకరణ పేరుతో ముందుకు వెళుతున్నారని,రాష్ట్రంలో మెడికల్ కళాశాలలను ప్రభుత్వం ప్రైవేటు పరం చేస్తే వైద్యం వ్యాపారంగా మారి సామాన్య పేదలు వైద్యం అందక ప్రాణాలు కోల్పోవాల్సిన పరిస్థితి వస్తుందని విమర్శించారు. పేదలకు ప్రభుత్వరంగంలోనే వైద్యం అందించాలనే లక్ష్యంతో గతప్రభుత్వం నిర్మాణాలు ప్రారంభించిన 17 వైద్య కళాశాలలో పులివెందుల, మార్కాపురం, ఆదోని, మదనపల్లి, నర్సీపట్నం, అమలాపురం, పాలకొల్లు, బాపట్ల, పెనుగొండ, పార్వతీపురం 10 కాలేజీలు ప్రభుత్వం నిర్వహణలో కాకుండా పీపీపీ పద్ధతి ద్వారా ప్రైవేటుసంస్థలకు అప్పగించటం కూటమి ప్రభుత్వం అసమర్థ పాలనకు నిదర్శనమన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు కాగిత సుధీర్ బాబు,ఉపాధ్యక్షులు కోకి రాఘవ రెడ్డి, ఏడుకొండలు రెడ్డి,నక్క వీరారెడ్డి,జోగి రాజా, బోలిమేర అనిల్,కొక్కిలిగడ్డ చేంచయ్య,గవిని కృష్ణ మూర్తి, హరిబాబు, మాల్యాద్రి శ్రీనివాసరావు, యేహోషువా పాల్గొన్నారు.

కోటి సంతకాల సేకరణ

విశాలాంధ్ర-రేపల్లె : రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రేపల్లె నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి డాక్టర్ గణేష్ నాయకత్వంలో రేపల్లె పట్టణ 27వ వార్డులో సేవ్ మెడికల్ కాలేజ్ కార్యక్రమంలో భాగంగా కోటి సంతకాల కార్యక్రమం నిర్వహిం చారు. కార్యక్రమంలో రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ చిమట బాలాజీ,టౌన్ కన్వీ నర్ కరేటి శేషగిరిరావు, 27 వార్డు ఇన్‌ఛార్జ్ గౌస్, రేపల్లె నియోజకవర్గం మహిళా విభాగం కన్వీనర్ వీసం నాగలక్ష్మి, రేపల్లె పట్టణ మహిళా విభాగం కన్వీనర్ బండ్రెడ్డి ఉమారాణి, వాణి, కవిత, కుద్దుస్, ఖాదర్ బాషా, గౌస్ ఖాన్, ఖాజా, పట్టెం శ్రీనివాస రావు, రామకృష్ణ, గోపి, శివ, భాష, చైతన్య, పవన్, సలీం పాల్గొన్నారు.

కార్తీక వనభోజనాలు

విశాలాంధ్ర - అద్దంకి : మండలం లోని సింగర కొండ ప్రసన్నాంజనేయ స్వామి సన్నిధిలో ఉన్న కాకతీయ కమ్మ సత్రంలో కార్తీక మాసం సందర్భంగా శనివారం కాకతీయ సేవా సమితి ఆధ్వర్యంలో కార్తీక వనభోజ నాలు ఏర్పాటు చేశారు ఉదయం సత్రంలో వినాయక స్వామి విగ్రహ ప్రతిష్టను వైభవంగా నిర్వహించారు. వనభోజనాలకు జిల్లా నలుమూలల నుంచి కమ్మ కుటుంబ సభ్యులు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

నోటీసు

అండర్ ఆర్డర్ XXI రూల్ 22 ఆఫ్ సి.పి.సి. కనిగిరి జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

E.P.No. 19/2024
O.S.No. 56/2018

వేమూరి వెంగళరావు వర్సెస్ .... D.Hr
రామగిరి నాయబ్ రసూల్ టు .... J.Dr

J.Dr రామగిరి నాయబ్ రసూల్, తండ్రి నాగూరు సాకిన్ : పోలవరం గ్రామం, కనిగిరి మండలం, ప్రకాశం జిల్లా.

పై నెంబరున D.Hr అండర్ ఆర్డర్ XXI రూల్ 22 ఆఫ్ సి.పి.సి. పిటీషన్ జె.డి.ఆర్ పై దాఖలు చేసియున్నారు. గనుక మీకు ఆక్షేపణలున్నచో తే: 10-11-2025దిన పగలు 10 గంటలకు మీరు స్వయంగా గానీ లేదా ప్లీడరు ద్వారా గానీ పై కోర్టు వారి ఎదుట హాజరై తెలుపుకొనేది. లేనిచో మిమ్ములను ఎక్స్‌పార్టీగా తీర్మానించబడునని తెలుసుకొనేది.

// By Order of the Court //
వాయిదా తేదీ : 10-11-2025

అబ్దుల్ గఫార్ షేక్
D.Hr తరపు న్యాయవాది
కనిగిరి, ప్రకాశం జిల్లా

కనిగిరి, తేదీ : 02-11-2025

CHANGE OF NAME

I, SRINIVASULA RAMABHARGAV (Old Name), S/o. SRINIVASULA VENKATA SITAPATHI RANGANADHAM, Resident of Door No.11-1-1/2, Mahatma Gandhi Road, Ward -17, Bapatla, Bapatla District - 522101, Andhra Pradesh. I have changed my name as SRINIVASULA RAMABHARGAVA (New Name) S/o. SRINIVASULA VENKATA SITAPATHI RANGANADHAM. Hereafter my name is known as SRINIVASULA RAMABHARGAVA (New Name) S/o. SRINIVASULA VENKATA SITAPATHI RANGANADHAM.

సూర్యలంక బీచ్‌కు అనుమతి

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : మొంథా తుఫాను ప్రభావం వలన సూర్యలంక బీచ్‌లో గుంతలు ఏర్పడటం వలన శుక్రవారం వరకు పర్యాటకులకు సముద్రంలోకి ప్రవేశించడంపై నిషేధం జరిగిందని డిప్యూటీ ఎంపీడీఓ జి.రామకృష్ణ తెలిపారు. సముద్రం అనుకూలంగా మారడంతో శనివారం ఉదయం నుండే బీచ్‌లోకి అనుమతించడమైనద న్నారు. జిల్లా కలెక్టర్,ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ వారి ఆదేశాల మేరకు స్థానిక నాయకుల సహకారంతో బీచ్‌లో 36 మొబైల్ టాయిలెట్స్,90 షవర్స్,80 స్త్రీలు దుస్తులు మార్చుకొను గదులు అదవి గ్రామపంచాయతీ వారి సహకారంతో ఏర్పాటు చేయడమైనదని తెలిపారు.జిల్లా పంచా యతీ అధికారి వారు ఎప్పటికప్పుడు బీచ్‌లో ఏర్పాట్లపై సమీక్షిస్తు న్నారు. పోలీస్ అవుట్ పోస్ట్ నందు మైక్ సిస్టమ్ బీచ్‌లో అదనపు విద్యుత్,సిసి కెమెరాలు, బీచ్‌లో పార్కింగ్ నందు బారికేడ్లు ఏర్పాటు చేయడమైనదని కార్తీకమాసం ముగిసే వరకు విచ్చేసే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ప్రత్యేక పారిశుధ్య నిర్వహణ చేపట్టవలసినదిగా మండలంలోని ఇతర గ్రామ పంచాయతీ లనుండి సిబ్బందిని పారిశుధ్య పని వారినికి రోజూ వారీగా విధులు కేటాయించవలసిందిగా డిప్యూటీ ఎంపీడీఓ రామకృష్ణను పర్యవేక్షించవలసిన దిగా డీపీవో ఇప్పటికే ఆదేశించారు.సూర్యలంక బీచ్‌లో కార్తీక మాసం ముగిసేవరకు వచ్చే భక్తులకు గ్రామపంచా యతీ వారు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేసినందున ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవలసినదిగా కోరారు.

మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు

- జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్

విశాలాంధ్ర - బాపట్ల : మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని,ప్రయాణికుల భద్రతకు ముఖ్య ప్రాధాన్యతనివ్వాలని నిబంధనలకు విరుద్ధంగా బస్సులను నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్ హెచ్చరించారు.జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు శనివారం జిల్లా వ్యాప్తంగా ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులను జిల్లా పోలీస్ అధికారులు తనిఖీ చేసి వాటి పత్రాలను,ప్రయాణికుల పట్ల భద్రతాపరంగా తీసుకుంటున్న చర్యలను పరిశీలించి డ్రైవర్లకు పలు భద్రత సూచనలు చేశారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకోవడానికి ప్రధానమైన కారణం మద్యం సేవించి వాహనాలు నడపడమేనని తెలిపారు. దీనిని నివారించడానికి జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నామని తెలిపారు.గత రెండు నెలల్లో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించిన 2182 మందిపై,మద్యం సేవించి వాహనాలు నడిపే 535 మందిపై కేసులు నమోదు చేయడం జరిగింద న్నారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వలన చోటుచేసుకునే ప్రమాదాల గురించి ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతూ,బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవిస్తూ పట్టుబడిన వారిని సంబంధిత న్యాయస్థానం ముందు హాజరు పరిచి కఠిన చర్యలు తీసుకుంటున్నామన్నారు.ఇటీవల మార్టూరు, మేదరమెట్ల పోలీస్ స్టేషన్ల పరిధిలో నిర్వహించిన తనిఖీలలో ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు డ్రైవర్లు మద్యం సేవించి వాహనం నడుపుతున్నట్లు గుర్తించి వారిపై,వారి యాజమాన్యంపై కేసు నమోదు చేశామని తెలిపారు. ప్రయాణికులు నగదును చెల్లించి ప్రయాణం చేసేటప్పుడు సౌకర్యంతో పాటుగా రక్షణ పరమైన సౌకర్యాలు కూడా పొందే హక్కు ఉందని ప్రయాణికులు కూడా బస్సు ఎక్కేటప్పుడు అత్యవసర ద్వారం ఎక్కడుంది,ఎటువంటి జాగ్రత్తలు బస్సు యాజమాన్యం తీసుకుంటు న్నారు. డ్రైవర్,బస్సు సిబ్బంది కండి షన్ ఎలా ఉన్నదని కూడా గమ నిస్తూ ఉండాలని,ఏదైనా భద్రతాపర మైన లోపం ఉన్న డ్రైవర్,సిబ్బంది భద్రత విషయంలో నిర్లక్ష్యం వ్యవహ రిస్తున్న, మద్యం సేవించి వాహనా లను నడుపుతున్నా రన్న అను మానం ఉన్న వెంటనే 112 నెంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలని తెలిపారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

విశాలాంధ్ర-మార్టూరు : ఎమ్మెల్యే ఏలూరి సాంబ శివరావు సారధ్యంలో శనివారం ఏలూరి క్యాంపు కార్యాలయం నిర్వహించిన ఉచిత మెగా కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది.లక్ష మందికి కంటి చూపు లక్ష్యంగా ఏలూరు చారిటబుల్ ట్రస్ట్,నోవా అగ్రి గ్రూప్ లిమిటెడ్, గ్రీన్ స్పార్క్ ఫౌండేషన్, శంకర కంటి ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు.తొలిత ఎమ్మెల్యే ఏలూరి ఏంటి స్వర్గీయ నందమూరి తారక రామారావు విగ్రహానికి,ఏలూరి నాగేశ్వరరావు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.అనంతరం కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు.ప్రత్యేక కౌంటర్ల ద్వారా మహిళలకు పురుషులకు వేరువేరుగా బీపీ షుగర్ రక్తపరీక్షలు నిర్వహించారు. అనంతరం కంటి వైద్య పరీక్షలు చేశారు.మొత్తం 300 మంది హాజరు కాగా 120 మందికి శస్త్ర చికిత్సలకు వైద్యులు రిఫర్ చేశారు. శిబిరంలో అనుభవజ్ఞులైన వైద్యుల బృందం పాల్గొని గ్రామస్తులకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించింది.శంకర్ కంటి ఆసుపత్రి సేవలు అమోఘం అన్నారు.గతంలో రోజుకి 150 మందికి మాత్రమే శస్త్ర చికిత్సలు నిర్వహించే వారని తాజాగా శంకర్ కంటి ఆసుపత్రిలో నూతన బ్లాకు ఏర్పాటు చేసి ప్రజలకు అత్యుత్తమ సేవలు అందించేందుకు 300 మందికి ఆపరేషన్లు చేసేలా ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు.గ్రామీణ ప్రాంతాల్లో కంటి సమస్యలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలకు నాణ్యమైన చికిత్స అందించడమే తమ లక్ష్యమని ఎమ్మెల్యే ఏలూరి అన్నారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ గుంజి వెంకట్రావు,సీనియర్ నాయకులు ఆదినారాయణ రంగయ్య తాటి నాగేశ్వరరావు తిరుమల శెట్టి శ్రీహరి, శంషుద్దీన్, జనార్దన్, రజాక్ ఫారుక్, సీతయ్య, తారక రామారావు, సాంబయ్య, సురేష్, బాబు నాయక్ పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ పంటల పై అవగాహన సదస్సు

విశాలాంధ్ర-టంగుటూరు : టంగుటూరు పొగాకు బోర్డు ఆవరణలో వేలం నిర్వహణాధి కారి అట్లూరి శ్రీనివాస రావు పొగాకు రైతులతో సమావేశమై 2025-26 పంట కాలానికి పొగాకు పంట నియంత్రణ మీద శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగ ఆయన మాట్లాడుతూ దేశీయంగా మరియు విదేశాలలో పొగాకుకు గల గిరాకీని మరియు నిల్వలను దృష్టిలో పెట్టుకొని ఆంధ్రప్రదేశ్‌లో 2025-26 పంట కాలానికి 142 మిలియన్ కేజీల ఉత్పత్తికి అనుమతించడమైనదని తెలిపారు. దక్షిణ ప్రాంత నల్ల రేగడి నేలలు బారన్ ఒక్కొంటికి 3565 కేజీల పరిమాణం మరియు ఒక్కొంటికి 4.75 ఎకరాల విస్తీర్ణం పంట సాగు కు అనుమతించారని తెలిపారు. అలాగే వివిధ దేశాలలో 2025-26 పంట కాలానికి పండించిన పొగాకు ఉత్పత్తి గణాంకాలను వివరించి, రైతులు రాబోయే పంట కాలానికి రైతులు తమకు కేటాయించిన మేరకే పొగాకు సాగు చేపట్టాలని తెలిపారు. అధిక ధరలతో భూమి మరియు బారనులు కౌలుకు తీసుకొని పొగాకు సాగు చేయరాదని తెలిపారు. అలాగే కొత్తగా అనధికారికంగా బ్యారన్ లు నిర్మించవద్దని తెలియచేసారు. వాణిజ్య సరళిలో పొగాకు నారుమడి సాగు చేయువారందరు తప్పనిసరిగా వారి పరిధిలోని పొగాకు బోర్డు కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని తెలిపారు. పొగాకు పంటతో పాటు ఇతర ప్రత్యామ్నాయ పంటలు కూడా సాగు చేయాలని తెలిపారు. పొగాకు బారన్ లైసెన్స్ రిజిస్ట్రేషన్ లు జరుగుతున్నాయని ఇంకా రిజిస్ట్రేషన్ చేసుకొనని వాళ్ళు బోర్డు నందు 2025-26 పంట కాలానికి రిజిస్ట్రేషన్ పొందగలరని తెలిపారు. ఈ కార్యక్రమంలో వేలం నిర్వహణాధికారి అట్లూరి శ్రీనివాస రావు, క్షేత్రాధికారి ఉపేంద్ర మరియు ఐటీసీ, జీపిఐ, పోలిశెట్టి కంపెనీ ప్రతినిధులు మరియు కారుమంచి, గొర్లమిట్ట, మట్టిపాడు, పొందూరు గ్రామాల పొగాకు రైతులు పాల్గొన్నారు.

రేపు బాపట్ల జిల్లాలో కేంద్ర బృందం పర్యటన

విశాలాంధ్ర - బాపట్ల : ఈనెల 10న జిల్లాలో కేంద్ర బృందం పర్యటించడం జరుగుతుందని అధికారులు అందరు సిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ తెలిపారు.ఈ నెల 10న జిల్లా లో కేంద్ర బృందం పర్యటన కు సంబంధించి ఫోటో ఎగ్జిబిషన్,పంటల నష్టం వివరాలు వంటి అంశాలపై శనివారం జిల్లా కలెక్టర్ జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గత నెలలో మొంథా తుఫాను కారణంగా దెబ్బతిన్న పంటలు,ఆర్అండ్‌బి,పంచాయతీ రాజ్ రోడ్లు, కల్వర్టులు,డ్రైనేజీ,కాల్వల నష్టాల అంచనాపై కేంద్ర బృందం బాపట్ల జిల్లాలో పర్యటించడం జరుగుతుందని తెలిపారు.సోమవారం ముందుగా కేంద్ర బృందం జిల్లా కలెక్టరేట్ చేరుకొని ఫోటో ఎగ్జిబిషన్ పరిశీలించడం జరుగుతుందని తెలిపారు.అనంతరం ఫీల్డ్ విజిట్ చేయడం జరుగుతుందన్నారు. శాఖల వారిగా జరిగిన నష్టంపై రిపోర్టును జాయింట్ కలెక్టర్‌కు అందజేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. జలవరుల శాఖకు సంబంధించి 3 డివిజన్ల పరిధిలో ఎంత నష్టం జరిగిందని,దానికి ఎంత ఖర్చు అవుతుందన్న పూర్తి వివరాలను జాయింట్ కలెక్టర్ అందజేయాలని, వ్యవసాయ, ఉద్యాన, ఆర్అండ్‌బి, పంచాయతీ రాజ్,గృహ నిర్మాణ సంస్థ,విద్యుత్ ఇతర శాఖలకు సంబంది ఎంత డమేజ్ జరిగిందని దానికి ఎంత ఖర్చు అవుతుందని పూర్తి వివరాలు జాయింట్ కలెక్టర్‌కు అందజేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ

విశాలాంధ్ర-టంగుటూరు: మండలం లోని నాయుడుపాలెంలో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా.డోలా శ్రీ బాలవీరాంజనేయ స్వామి క్యాంప్ ఆఫీస్‌లో ఎం నిడమలూరు గ్రామానికి చెందిన బచ్చు లక్ష్మి అనారోగ్యం కారణ ంగా సర్జరీ చేయించుకోగా సర్జరీకి సంబంధించిన బిల్ మొత్తాన్ని సీఎం రిలీఫ్ ఫండ్‌కి దరఖాస్తు చేసుకోగా ఆ చెక్‌ని శనివారం మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి లబ్ధిదారుని కుమారుడు బచ్చు మహేష్‌కి అందజేశారు. ఎం నిడమలూరు టీడీపీ అధ్యక్షులు కాకుమాని శ్రీకాంత్ టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

చంద్రబాబు పర్యటనను విజయవంతం చేయాలి : ఎమ్మెల్యే ఉగ్ర

విశాలాంధ్ర-పీసీపల్లి : ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యట నను విజయవంతం చేయాలని స్థానిక శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసిం హారెడ్డి అన్నారు. ఈనెల 11న పీసీ పల్లి మండలం లో ఎం ఎస్ ఎం ఈ పార్క్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హాజరవు తున్నారని కార్యక్రమాన్ని అధికారులు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఆ ప్రాంతాన్ని స్థానిక నాయకులతో కలిసి శనివారం ఎమ్మెల్యే పరిశీలించి తగు సూచనలు సలహాలు తెలియజేశారు. ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

కోటి సంతకాల సేకరణ

విశాలాంధ్ర-సీఎస్‌పురం: ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైయస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు, ప్రకాశం జిల్లా వైయస్ఆర్ సీపీ అధ్యక్షులు బూచేపల్లి శివ ప్రసాద్ రెడ్డి, కనిగిరి నియోజకవర్గం వైసీపీ ఇంచార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ పిలుపు మేరకు సియస్ పురం మండల వైయస్ఆర్ సిపి అధ్యక్షులు పాలుగుళ్ల మల్లికార్జున రెడ్డి సూచనలతో మండలంలోని దర్శి గుంటపేట పంచాయతీ పరిధిలోని బోదవుల దిన్నె గ్రామంలో మాజీ సింగిల్ విండో డైరెక్టర్ పందిటి వెంగళరావు ఆధ్వర్యంలో శనివారం మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రకాశం జిల్లా వైఎస్ఆర్‌సిపి ట్రేడ్ యూనియన్ అధ్యక్షులు మితికెల గురవయ్య పాల్గొని ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ మెడికల్ కాలేజీ ప్రైవేటీకరణ ప్రజలకు అవగాహన కల్పించి సంతకాలు సేకరించారు ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ప్రైవేటు పరం చేస్తూ కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని అన్నారు ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ప్రైవేటుపరం చేస్తే పేద మధ్య తరగతుల ప్రజలకు వైద్య విద్య దూరమవుతుందని ప్రజలకు వివరించారు. వైఎస్ఆర్‌సిపి నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

విశాలాంధ్ర epaper.visalaandhra.com ఆదివారం 09 । నవంబరు । 2025

ఈశ్వరయ్యకు అభినందనల వెల్లువ

సమావేశంలో మాట్లాడుతున్న ఈశ్వరయ్య

ఎస్టీయూ

సన్మానిస్తున్న జర్నలిస్టులు

సంతనూతలపాడు నియోజకవర్గం

ఏఐవైఎఫ్

ఆటో వర్కర్స్ యూనియన్

బీసీ సంక్షేమ సంఘం

ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్

గిద్దలూరు

సీపీఐ ప్రకాశం జిల్లా సమితి

యర్రగొండపాలెం

మార్కాపురం

కనిగిరి

పామూరు

కొత్తపట్నం

శ్రీ హరి హర క్షేత్రంలో స్వాములకు నిత్య అన్నదానం

విశాలాంధ్ర-చీమకుర్తి : చీమకుర్తి శ్రీ హరి హర క్షేత్రంలో ఆదివారము నుండి సర్వ దీక్షా స్వాములకు ఏటా ఆనవాయితీగా జరుగు భిక్షా కార్యక్రమం ప్రారంభిస్తున్నట్టు శ్రీ హరి హర క్షేత్ర ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. పవిత్ర కార్తీక మాసం సందర్భంగా క్షేత్రంలో ఆదివారం ఉదయం మాజీ మంత్రి శిద్దా రాఘవరావు దంపతులు కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో శ్రీ అయ్యప్ప స్వామి వారికి ప్రత్యేక పూజలు అభిషేక అలంకారాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 9 గంటలకు హరిహర సుత అయ్యప్ప స్వామి వారికి గంగా పూజ పంచామృత అభిషేకాలతో పాటు కలిసే ప్రతిష్ట మహోత్సవ అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రతినిధులు తెలిపారు. మాజీ మంత్రి సిద్ధ రాఘవరావు దంపతులు వారి కుటుంబ సభ్యులు ప్రారంభిస్తారని ఆలయ ప్రతినిధులు తెలిపారు. నిత్య దాన దాన పథకంలో సర్వదీక్షా స్వాములు పాల్గొని భిక్ష స్వీకరించి శ్రీ అయ్యప్ప స్వామి కృపకు పాత్రులు కాగలరని ఆలయ ప్రతినిధులు దీక్షా స్వాములను కోరారు.